సంపుటి : 18
సంచిక : 169
Vol : 18
Issue : 169

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, మంగళవారం 1 సెప్టెంబర్ 2026
Warangal, Tuesday 1 September 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

www.epaper.
peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts

# తెలంగాణలో వరుసగా...

ఏడు నెలల పాటు అత్యధిక ద్రవ్యోల్బణం నమోదు

నిత్యావసరాలను ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకోవడమే కారణం

సామాన్యులపై ధరల పిడుగు..

ధరల నియంత్రణపై ప్రభుత్వం దృష్టి సారించాలి

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో సామాన్య ప్రజలపై ధరల పిడుగు పడింది. ఈ ఏడాది జులైలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.32 శాతంగా నమోదైంది. దేశంలోని ప్రధాన రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణా రాష్ట్రంలో నమోదైన ద్రవ్యోల్బణం అత్యధికం. జనవరి నుంచి జులై వరకు వరుసగా ఏడు నెలల పాటు తెలంగాణ అత్యధిక ద్రవ్యోల్బణం నమోదు చేసిన రాష్ట్రం రాష్ట్రంగా కొనసాగింది. జనవరి నుండి ఇప్పటివరకు రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతోంది. జనవరిలో 4.92 శాతం, ఫిబ్రవరిలో 5.02, మార్చిలో 5.83, ఏప్రిల్‌లో 5.81, (మిగతా 2లో...)




# మూలుగుతున్న నిధులు?

ఎంపీ ల్యాడ్స్ నిధుల ఖర్చు నామమాత్రమే

రూ.394 కోట్లు వస్తే... ఖర్చయింది రూ.94 కోట్లే

నిధుల వినియోగంలో తెలంగాణ ఎంపీలు వెనుకడుగు

అందిన నిధులు 10శాతం కూడా ఖర్చు చేయలే...



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : లోక్‌సభ సభ్యులుగా ఎన్నికై రెండేళ్లు పూర్తవుతున్నా తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం కేటాయించిన ఎంపీ ల్యాడ్స్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. కేంద్రం ఒక్కో ఎంపీకి ఏడాదికి రూ.5 కోట్ల చొప్పున కేటాయిస్తుండగా.. రాష్ట్రంలోని ఆరుగురు ఎంపీలు రెండేళ్లలో తమకు అందిన నిధుల్లో 10 శాతాన్ని కూడా ఖర్చు చేయలేదు. దేశవ్యాప్తంగా ఎంపీ ల్యాడ్స్ నిధుల సగటు వినియోగం 75 శాతంగా ఉండగా.. తెలంగాణలో మాత్రం ఇది కేవలం 23 శాతంగా నమోదైంది. ఎంపవర్డ్ ఇండియన్ అనే స్వతంత్ర ప్రజా ప్రయోజన డేటా డ్యాష్‌బోర్డ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. తెలంగాణకు చెందిన 23 మంది ఎంపీలకు గత రెండేళ్లలో కేంద్రం రూ.394 కోట్లను కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకు సుమారు రూ.94 కోట్లను మాత్రమే వినియోగించినట్లు నమోదైంది. ఈ నిధులతో 2,347 అభివృద్ధి పనులు పూర్తయినట్లు డేటా పేర్కొంది.

ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముందున్నారు. గత రెండేళ్లలో తనకు కేటాయించిన రూ.28 కోట్లలో 56 శాతం నిధులను ఆయన వినియోగించినట్లు డేటా చెబుతోంది. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ (మిగతా 2లో...)

# అంగట్లో అంగన్వాడీలా?

గిరిజన గ్రామాల్లో అధికార పార్టీ నేత సీక్రెట్ ఆపరేషన్

- 2 లక్షలకే అంగన్వాడీ ఉద్యోగాలు
- కాసులు కొట్టు ఉద్యోగం పట్టు అంటూ ప్రచారం
- మెరిట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగమా?
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఏజెన్సీలో అధికార పార్టీ నేత హామీలు
- వసూళ్ల దందాలో ఐసిడిఎస్‌లో ఓ అధికారి పాత్ర?

2వ పేజీలో..



# రాజకీయాల్లో భారీ మార్పు రాబోతోంది..

- వైఎస్ఆర్ ప్రజా సంక్షేమ పంథానే నాకు ఆదర్శం
- రాష్ట్రంలో సంక్షేమ వ్యవస్థలు దెబ్బతిన్నాయి
- రాజగోపాల్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో భారీ మార్పు రాబోతోందని చెప్పుకొచ్చారు. వైఎస్సార్ పైన తన అభిమానం ఏంటో స్పష్టం చేసారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్క దారి పడుతున్నాయని చెప్పుకొచ్చారు. ఈ మార్పులో తన పాత్ర కీలకంగా ఉంటుందని స్పష్టం చేసారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు రాజకీయంగా సంచలనంగా మారాయి. వైఎస్సార్‌సీపీ పార్టీ ఎన్ఆర్ఐ టీమ్ ప్రతినిధులు నిర్వహించిన ప్రత్యక్ష ట్విట్టర్ స్పేస్ లో తన లక్ష్యాలను స్పష్టం చేసారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పూర్తిగా పక్కదారి పడుతున్నాయని, ఈ తరుణంలో మార్పు దిశగా బలమైన అడుగులు వేయాల్సిన అవసరం వచ్చిందని (మిగతా 2లో...)

# హైదరాబాద్‌లో మెరుపు ధర్నా

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయం ముట్టడి
- కార్యాలయ గేట్లకు నల్లరంగు పూసి నిరసన
- పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట
- ఉద్రిక్తతకు దారితీసిన పరిస్థితులు...

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు నల్ల జెండాలు ప్రదర్శించారు. దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. యూత్ కాంగ్రెస్ ముట్టడి పిలుపు నేపథ్యంలో నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకారులు లోపలికి దూసుకెళ్లకుండా బారికేడ్లను అమర్చారు. ఆ బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది.

దేశవ్యాప్తంగా వివిధ విద్యా పరీక్షల నిర్వహణలో జరుగుతున్న లోపాలు, పేపర్ లీకేజీల వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని యూత్ కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే యువత రోడ్లపైకి (మిగతా 2లో)



# గందరగోళానికి చెక్..!

దేశమంతా ఒకే ప్రమాణానిక 'టైమ్'

ఒకే దేశం... ఒకే సమయానికి నిర్ణయం

అమలుకానున్న చట్టపరమైన ప్రమాణం



పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సమయ వినియోగంలో కీలక మార్పు రాబోతుంది. ఇకపై దేశంలోని అధికారిక, పరిపాలనా, వాణిజ్య, న్యాయ, డిజిటల్ కార్యకలాపాల్లో భారత ప్రామాణిక సమయాన్నే తప్పనిసరిగా ఉపయోగించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ 2026 భారత ప్రామాణిక సమయ నిబంధనలను ప్రకటించింది. ఈ నిబంధనలు గెజిట్‌లో ప్రచురితమైన తేదీ నుంచి 180 రోజుల తర్వాత అమల్లోకి రానున్నాయి. (మిగతా 2లో...)

# అంగట్లో అంగన్వాడీలా?

- గిరిజన గ్రామాల్లో అధికార పార్టీ నేత సీక్రెట్ ఆపరేషన్
- 2 లక్షలకే అంగన్వాడీ ఉద్యోగాలు
- కాసులు కొట్టు ఉద్యోగం పట్టు అంటూ ప్రచారం
- మెరిట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగమా?
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఏజెన్సీలో అధికార పార్టీ నేత హామీలు
- వసూళ్ల దందాలో ఐసిడిఎస్‌లో ఓ అధికారి పాత్ర?

**ములుగు ప్రతినిధి-పీపుల్స్ డైరీ :**

శిశు సంక్షేమ శాఖ ఉద్యోగాల్లో అధికార పార్టీ హవా నడుస్తుందంటూ వెంకటాపురం ఏజెన్సీలో ఓ నేత గ్రామాల్లో ప్రచారం సాగిస్తున్నట్లు తెలుస్తుంది. రెండు లక్షల రూపాయలు చెల్లిస్తే మెరిట్‌తో సంబంధం లేకుండా వారు చెప్పిన వ్యక్తులకే ఉద్యోగ అవకాశం ఉంటుందంటూ అంగన్వాడి అభ్యర్థులకు వల విసురుతున్నట్లు ఆ పార్టీలోని కొందరు నేతలే వాపోతున్నారు. గిరిజన మహిళలే టార్గెట్‌గా చేస్తున్న ఈ సీక్రెట్ ఆపరేషన్ లో అధికార పార్టీకి చెందిన ప్రముఖ నేత ఉండడం ఏజెన్సీలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే భద్రాచలం ఎమ్మెల్యే సిసి ఉద్యోగాల పేరిట 10 కోట్లు వసూలు చేశారంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో.. వెంకటాపురంలో కూడా అధికార పార్టీకి చెందిన నేత, ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు అడగడం ఏజెన్సీలో కలకలం రేపుతున్న అంశం. ఒక్కో అంగన్వాడి పోస్టుకు రెండు లక్షల



రూపాయలు ఇస్తే ఉద్యోగం ఖచ్చితంగా వస్తుందని నమ్మబలుకుతూ డబ్బులు గుంజే ప్రయత్నం చేయడం ప్రజలందరినీ ఆలోచింప చేస్తుంది. ప్రభుత్వంలోని పెద్దలు అంగన్వాడీ ఉద్యోగాల నియామకం పారదర్శకంగానే ఉంటుందని చెబుతున్న వారి మాటలు.. అధికార పార్టీలోనే నేతల చేష్టలకు ఒకదానితో ఒకటి పొంతన లేకుండా ఉంటున్నాయి. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో ప్రజలు కూడా వారి మాటలను నమ్మే అవకాశం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇప్పటికే జిల్లాకు చెందిన మంత్రిపై అనేక అవినీతి ఆరోపణలు వస్తున్న తరుణంలో.. శిశు సంక్షేమ శాఖలో అవినీతి కుంభకోణానికి తావు ఇస్తే ఆ ఆరోపణలన్నింటిని ప్రజలు నమ్మే పరిస్థితి ఏర్పడుతుంది. నిజంగానే ఆ శాఖలో అవినీతే జరిగితే అంగన్వాడి ఉద్యోగాల కోసం అర్జీ పెట్టుకున్న అభ్యర్థులు మోసపోయే ప్రమాదం కూడా మెండుగా ఉంటుంది. అలా జరగకుండా చూసేకునే గురుతర బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలి.

ఏజెన్సీలో అధికార పార్టీ నేతలు అభ్యర్థులకు ఆశ కల్పించే విధంగా చేస్తున్న సీక్రెట్ ఆపరేషన్ పై జిల్లా మంత్రి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఏజెన్సీలో ఈ ఘనుడు చేసిన పైరవీలపై కొందరు నేతలు పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత ఉండేలా జిల్లా పాలనాధికారి చర్యలు తీసుకోవాలి. లేకపోతే అభ్యర్థులు లక్షల రూపాయలు పోగొట్టుకునే ప్రమాదం ఉంటుంది. ఈ నిందను జిల్లా పాలనాధికారితో పాటు జిల్లా మంత్రినే మోయాల్సి వస్తుందని పలువురి మేధావుల అభిప్రాయం. జిల్లాలోని ఐసిడిఎస్ శాఖలో ఓ అధికారి అధికార పార్టీకి నేతతో చేతులు కలిపినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ఇద్దరి అవినీతి పొత్తుపై మీ "పీపుల్స్ డైరీ" దినపత్రికలో మరో కథనం వచ్చే సంచికలో వెలువడబోతోంది.

# గందరగోళానికి చెక్..

(మొదటి పేజీ తరువాయి)

అంటే సుమారుగా 2027 మార్చి నుంచి దేశవ్యాప్తంగా ఈ కొత్త విధానం అమల్లోకి రానుంది.

భారతదేశంలో ప్రస్తుతం అధికారిక సమయంగా భారత ప్రామాణిక సమయాన్నే ఉపయోగిస్తున్నారు. అయితే కొత్త నిబంధనల ద్వారా సమయ వినియోగానికి మరింత స్పష్టమైన చట్టపరమైన ప్రమాణాన్ని తీసుకురానున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, న్యాయపరమైన వ్యవహారాలు, వాణిజ్య లావాదేవీలు, ఆర్థిక సంస్థలు, డిజిటల్ సేవలు, సమయ ఆధారిత సాంకేతిక వ్యవస్థలు తదితర రంగాల్లో భారత ప్రామాణిక సమయాన్నే ప్రామాణికంగా తీసుకోవాల్సి ఉంటుంది.




ఈ నిర్ణయం వల్ల ప్రజలు తమ గడియారాలు, మొబైల్ ఫోన్లలో సమయాన్ని ప్రత్యేకంగా మార్చాల్సిన అవసరం ఉండదు. దేశంలో ఇప్పటికే భారత ప్రామాణిక సమయమే అధికారిక సమయం. కొత్త నిబంధనల ప్రధాన ఉద్దేశం అధికారిక, వాణిజ్య, సాంకేతిక వ్యవస్థల్లో సమయానికి సంబంధించిన గందరగోళాన్ని తగ్గించడం. ముఖ్యంగా ఒకే సమయంలో కోట్లాది లావాదేవీలు జరిగే డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో సమయానికి అత్యంత ప్రాధాన్యత ఉంది.

**బ్యాంకింగ్ నుంచి విద్యుత్ వ్యవస్థల వరకు..!**

ప్రస్తుతం బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, వాటాల మార్కెట్లు, దూరసంప్రదింపుల వ్యవస్థలు, రైల్వేలు, విమానయానం, విద్యుత్ వ్యవస్థలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు వంటి అనేక రంగాలు అత్యంత కచ్చితమైన సమయంపై ఆధారపడి పనిచేస్తున్నాయి. ఒక లావాదేవీ ఏ సమయంలో జరిగింది? ఒక విమానం ఎప్పుడు బయలుదేరింది? ఒక రైలు ఎప్పుడు కదిలింది? ఒక ఆర్థిక లావాదేవీ ఎప్పుడు నమోదైంది? వంటి అంశాల్లో కచ్చితమైన సమయ నమోదు కీలకం. దేశవ్యాప్తంగా ఒకే సమయ ప్రమాణాన్ని ఉపయోగించడం ద్వారా వివిధ వ్యవస్థల మధ్య సమన్వయం మరింత మెరుగుపడుతుందని కేంద్రం భావిస్తోంది.

**విదేశీ సమయ వ్యవస్థలపై ఆధారపడటం తగ్గుతుందా?**

కొత్త విధానంలో మరో ముఖ్యమైన అంశం దేశీయంగా కచ్చితమైన సమయాన్ని అందించే వ్యవస్థను బలోపేతం చేయడం. ప్రస్తుతం కొన్ని కీలక సాంకేతిక వ్యవస్థలు విదేశీ ఉపగ్రహ ఆధారిత సమయ సంకేతాలపై ఆధారపడుతున్నాయి. భారతదేశంలోనే అత్యంత కచ్చితమైన ప్రామాణిక సమయాన్ని రూపొందించి, దాన్ని వివిధ డిజిటల్ వ్యవస్థలకు అందించే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు. దీని ద్వారా దేశంలోని కీలక రంగాలకు విశ్వసనీయమైన సమయ సంకేతాలను అందించడంతో పాటు, విదేశీ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది.

# మూలుగుతున్న నిధులు..

(మొదటి పేజీ తరువాయి)

49 శాతం, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర 48 శాతం నిధులను ఖర్చు చేసినట్లు నమోదైంది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు అత్యధికంగా రూ.32 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.3.47 కోట్లు మాత్రమే వినియోగించినట్లు డ్యాష్‌బోర్డ్ పేర్కొంది. ఇది మొత్తం కేటాయింపులో సుమారు 11 శాతం. రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ పదవీకాలం ఇటీవలే ప్రారంభమైన నేపథ్యంలో ఆయన ఖాతాలో ఇప్పటివరకు ఎలాంటి వ్యయం నమోదుకాలేదు.

ఆరుగురు ఎంపీలు రెండేళ్లలో తమకు కేటాయించిన నిధుల్లో 10 శాతంలోపే ఖర్చు చేసినట్లు డేటా చెబుతోంది. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రూ.14.70 కోట్లలో రూ.1.11 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి 2.08 శాతం, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు బి.పార్థసారథి రెడ్డి 2.43 శాతం నిధులను మాత్రమే వినియోగించినట్లు నమోదైంది. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రుల విషయంలోనూ పోర్టల్ డేటాలో తక్కువ వినియోగం నమోదైంది. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి రూ.14.70 కోట్లు కేటాయించగా రూ.47.50 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. మరో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ రూ.17.27 కోట్లలో రూ.6.50 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.

అయితే కిషన్‌రెడ్డి కార్యాలయం ఈ గణాంకాలను ఖండించింది. మార్చి 2026 నాటికి సుమారు రూ.14 కోట్లలో రూ.10 కోట్ల విలువైన పనులకు సిఫారసులు చేశామని, వాటిలో రూ.8.90 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపింది. జిల్లా యంత్రాంగం పనులు పూర్తి చేసి, వినియోగ ధ్రువపత్రాలను కేంద్రానికి సమర్పించాల్సి ఉంటుందని.. పోర్టల్‌లో వివరాలు అప్‌డేట్ కాకపోవడం వల్లే తక్కువ వినియోగం కనిపిస్తోందని పేర్కొంది. బండి సంజయ్ కార్యాలయం కూడా ఇదే తరహా వివరణ ఇచ్చింది. 2019 నుంచి మంత్రి సుమారు రూ.30 కోట్ల విలువైన పనులకు సిఫారసు చేశారని, గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కేవలం రూ.88 లక్షల బ్యాలెన్స్ మాత్రమే ఉన్నట్లు పేర్కొంది.

# అనుమతుల్లేని జీడి పుల్లల లారీ పట్టివేత

**రెండు రాష్ట్రాల అటవీ చెక్‌పోస్టులు దాటినా.. దమ్మపేటలో పట్టుకున్న అధికారులు**

**దమ్మపేట ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** అనుమతులు లేకుండా జీడి పుల్లలను భారీ స్థాయిలో తరలిస్తున్న లారీని దమ్మపేట అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కత్తిపూడి నుంచి తెలంగాణలోని కాగజ్‌నగర్‌కు జీడి పుల్లల లోడుతో వెళు_న్న లారీని మందలపల్లి జాతీయ రహదారిపై అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

కత్తిపూడి నుంచి కాగజ్‌నగర్ వరకు రెండు రాష్ట్రాల పరిధిలోని పలు అటవీ చెక్‌పోస్టులను దాటుకుని వచ్చిన ఈ లారీ చివరకు మందలపల్లి వద్ద అటవీ శాఖ అధికారుల తనిఖీలో పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. లారీకి అవసరమైన అటవీ ఉత్పత్తుల రవాణా అనుమతులు ఉన్నాయా? లేదా? అనే అంశంపై అధికారులు పరిశీలించినట్లు






తెలిసింది.

**మూడు రోజులుగా అటవీ కార్యాలయం ఎదుటే లారీ**

లారీని పట్టుకున్న అనంతరం గత మూడు రోజులుగా దమ్మపేట అటవీ కార్యాలయం ఎదుట నిలిపి ఉంచినట్లు సమాచారం. లారీలోని జీడి పుల్లల మూలం, రవాణా అనుమతులు, సంబంధిత పత్రాలు, రవాణా మార్గం తదితర అంశాలపై అటవీ అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది.

**అటవీ ఉత్పత్తుల రవాణాకు అనుమతులు తప్పనిసరి**

అటవీ ఉత్పత్తుల రవాణాను నియంత్రించేందుకు అటవీ చట్టాలు, అటవీ ఉత్పత్తుల రవాణా నిబంధనలు అమల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం, 1967లోని సెక్షన్ 29 ప్రకారం అటవీ ఉత్పత్తుల రవాణాకు అనుమతులు, తనిఖీ కేంద్రాలు, రవాణా మార్గాలు తదితర అంశాలను నియంత్రించే నిబంధనలు రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా అటవీ ఉత్పత్తులను తరలించిన సందర్భంలో సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

అయితే పట్టుబడిన జీడి పుల్లలు ఏ వర్గానికి చెందిన అటవీ ఉత్పత్తిగా అధికారులు పరిగణించారు, అవి ఏ భూమి నుంచి సేకరించారు, రవాణాకు ఏ పర్మిట్ అవసరం, ఆ పర్మిట్ పూర్తిగా లేకపోయిందా లేదా లోపాలున్నాయా అనే అంశాల ఆధారంగానే కచ్చితమైన సెక్షన్లు నిర్ణయించాల్సి ఉంటుంది.

**మామూలు కేసే"నా? అధికారుల చర్యలపై చర్చ**

ఈ ఘటనపై దమ్మపేట ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాసును పీపుల్స్ డైరీ వివరణ కోరగా, "జీడి పుల్లలు కావడంతో మామూలు కేసు చేస్తున్నాం" అని తెలిపారు. అయితే రెండు రాష్ట్రాల మీదుగా రవాణా చేస్తూ పలు చెక్‌పోస్టులను దాటిన లారీ దమ్మపేట వద్ద పట్టుబడిన నేపథ్యంలో, రవాణాకు సంబంధించిన అనుమతులు, పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# మామునూరు నాలుగో బెటాలియన్లో ఘనంగా పదవీ విరమణ కార్యక్రమం

**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** మామనూర్ నాలుగు బెటాలియన్‌లో సోమవారం బెటాలియన్ నందు వి. పురుషోత్తం రెడ్డి రిజర్వ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా కమాండెంట్ ఎన్.వి. సత్య శ్రీనివాస్ రావు హాజరు అయ్యి పదవీ విరమణ పొందుతున్న వి.పురుషోత్తం రెడ్డి రిజర్వ్ ఇన్స్పెక్టర్‌కు శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ... పురుషోత్తం రెడ్డి కానిస్టేబుల్ గా భర్తీ అయి అంచెలంచెలుగా ఎదిగి రిజర్వ్ ఇన్స్పెక్టర్ స్థాయికి వచ్చారని, సుధీర్ఘ కాలం పోలీసు శాఖలో విధులు నిర్వర్తించారని, అలాగే తమ సర్వీస్ లో ఎలాంటి రిమార్క్స్ లేకుండా పదవీ విరమణ పొదుతున్నారని తెలియజేసారు. పదవీ విరమణ తర్వాత తమ కుటుంబంతో సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ బాలయ్య, రాజేందర్ రిజర్వు ఇన్స్పెక్టర్స్ విజయ్,కార్తీక్, రవి,సర్వర్,వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్,కృష్ణ, రాంప్రసాద్ అధికారులు మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి పోరాడాల్సి వస్తోందని అన్నారు. విద్యార్థుల ఆగ్రహానికి కారణమైన కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇప్పటికే తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటోందని, ఇప్పుడు హోం శాఖ కూడా విద్యార్థులపై హింసను ప్రేరేపించడం సిగ్గుచేటని అన్నారు.

ఈ నిరసన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రోష్ని కుశాల్ జైస్వాల్ నాయకత్వం వహించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో, వారి భద్రతను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులపై పోలీసు బలగాలతో అణచివేత చర్యలకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థులపై పెల్లెట్ గన్లు, ఏకే 47 తుపాకులను సైతం ప్రయోగించారని ఆమె ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఆందోళన ఉధృతం కావడంతో పోలీసులు రంగంలోకి దిగి నిరసనకారులను రోడ్డుపై నుంచి బలవంతంగా లాక్కెళ్లారు. పలువురు యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యార్థుల గొంతు నొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా తమ పోరాటం ఆగేది లేదని, రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణలో వరుసగా...

(మొదటి పేజీ తరువాయి)

మేలో 6.15, జూన్‌లో 6.36, జులైలో 6.32 శాతంగా ఉంది. జూన్‌తో పోలిస్తే కొద్దిగా తగ్గినా 6 శాతానికి పైగా ఉండటంతో దేశంలోనే అత్యధిక ద్రవ్యోల్బణం నమోదైన రాష్ట్రంగా తెలంగాణా తొలి స్థానంలోనే నిలిచింది.గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత కష్టంగా ఉంది. ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా వినియోగదారుల ధరల సూచిక విలువ జులైలో గ్రామీణ ద్రవ్యోల్బణం 6.86 శాతం, పట్టణాల్లో 5.92 శాతం నమోదైంది. వ్యవసాయ కుటుంబాలు, కూలీలు, తక్కువ ఆదాయ వర్గాలపై ఈ పెరుగుదల ప్రభావం ఎక్కువగా పడుతోంది. తెలంగాణ తర్వాత ఆంధ్రప్రదేశ్ 5.72%, తమిళనాడు 5.44%, మధ్యప్రదేశ్ 4.91%, కర్ణాటక 4.89%తో ఉన్నాయి. దేశవ్యాప్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతంగా ఉంది. తెలంగాణలో వినియోగదారుల ధరల సూచిక విలువ 110.06 పాయింట్లుగా నమోదై ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉంది. ధరలు పెరగడానికి ప్రధాన కారణం నిత్యావసరాలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావడమే అని తెలుస్తోంది. పాలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు రవాణా ఖర్చుతో కలిపి బాగా ఖరీదుగా మారుతున్నాయి. ఉదాహరణకు మహారాష్ట్రలో ఉల్లి రూ.10 ఉంటే ఇక్కడ రూ.30కి అమ్ముతున్నారు. కొత్త వినియోగదారుల ధరల సూచిక శ్రేణి కూడా ఈ పెరుగుదలకు ఒక కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో ఆదాయం పెరగని సామాన్య కుటుంబాల కొనుగోలు శక్తి తగ్గే ప్రమాదం ఉంది.ఈ పరిస్థితిని కంట్రోల్ చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సామాన్య, మధ్యతరగతి ప్రజలు కోరుతున్నారు.

# రాజకీయాల్లో భారీ మార్పు రాబోతోంది

(మొదటి పేజీ తరువాయి)

చెప్పుకొచ్చారు. తెలంగాణలో ప్రజలకు మేలు చేసే ఒక బలమైన రాజకీయ వేదికను పునర్నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నానని వెల్లడించారు. అందులో భాగంగానే గత కొన్ని నెలలుగా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిర్భయంగా ఖండిస్తున్నానని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమ పంథానే తనకు ఆదర్శమని రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. గత వైఎస్సార్ స్వర్ణయుగాన్ని మళ్లీ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా త్వరలోనే ఒక సంచలన నిర్ణయంతో కూడిన ప్రజా రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ లో సంక్షేమ వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, విద్యా రంగానికి ఎంతో కీలకమైన ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూడా ప్రభుత్వం చెల్లించలేని దయనీయ మైన పరిస్థితి నెలకొందని విమర్శించారు. రాజకీయాన్ని కేవలం వ్యాపారంగా మార్చుకుని, పైసలు సంపాదించడమే ధ్యేయంగా వచ్చిన వాళ్లు రాజకీయాల్లో శాశ్వతంగా నిలబడలేరని చెప్పుకొచ్చారు.

రైతు బంధు లాంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఒక చేతితో రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు నటిస్తూనే, మరో చేతితో గల్లీ గల్లీలో ఉన్న బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు పెంచి ఆ డబ్బును ప్రజల నుంచి దారుణంగా గుంజుకుంటోందని ఆరోపించారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే వైఎస్సార్ టీం అంటారని... ఈ రోజు తాము ఈ స్థాయిలో ఉన్నామంటే రాజశేఖర రెడ్డే కారణమని.. తాము ఎప్పటికీ అభిమానంతోనే ఉంటామని.. తమ కుటుంబ సభ్యుడిలా అండగా నిలిచారని చెప్పుకొచ్చారు. దీంతో.. అసలు రాజగోపాల్ రెడ్డి రాజకీయంగా ఏం చేయబోతున్నారనే చర్చ ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

# మామునూరు ఓపెన్ ఎయిర్ జైలు సందర్శన



**పీపుల్స్‌డైరీ-వరంగల్ :** వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ మామునూరు ఓపెన్ ఎయిర్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించిలి, ఖైదీలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయ సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.



అనంతరం ఖైదీలు నివసించే బ్యారక్‌లు, వసతి ప్రదేశాలను సందర్శించి పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి కేసుల స్థితిగతులు, న్యాయపరమైన సమస్యలు మరియు అవసరమైన న్యాయ సహాయం గురించి తెలుసుకున్నారు.

అనంతరం న్యూ లైఫ్ సొసైటీ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ సందర్శించి, అక్కడ సంరక్షణ పొందుతున్న చిన్నారులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, వాటి నిర్వహణ తీరును తనిఖీ చేశారు. చిన్నారులు నివసించే లిగదులను సందర్శించి, వసతి, పరిశుభ్రత, భద్రత మరియు వారికి కల్పిస్తున్న ప్రాథమిక సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజతో పాటు జైలు సూపరింటెండెంట్ కళా సాగర్, జైలర్లు పూర్ణచందర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ శ్రీ పి. శ్రీనివాసరావు, లైఫ్ సొసైటీ నిర్వాహకురాలు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేసి ప్రాణరక్షణ కల్పించాలి..బాధితుల వేడుకోలు

### మా భూమిని లాక్కొని మాపైనే దాడులు చేశారు



**రేగొండ ఆగస్టు 31 పీపుల్స్ డైరీ :** మా భూమిని లాక్కొని మాపైనే దాడులు చేశారు.న్యాయం చేసి ప్రాణరక్షణ కల్పించాలని రేగొండ మండలం రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన షేక్ భాషా, షేక్ యాఖ్నబీ, షేక్ చాంద్పాషా, షేక్ సుల్తాన, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమకు జరిగిన అన్యాయాన్ని ఇలా వెళ్లబో సుకున్నారు. రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన షేక్ భాషా, షేక్ యాఖ్నబీ, షేక్ చాంద్పాషా, షేక్ సుల్తాన,లకు 1985 సంవత్సరం గత టి డీ పి ప్రభుత్వం గ్రామంలోని బీసీ కుటుంబలకు ఒక్కో కుటుంబనికి రెండు వందల గజాల ఇంటి స్థలాన్ని పంపిణి చేశారు. అందులో కొంతమంది గృహాలు నిర్మించుకున్నారు. షేక్ భాషకు ఆర్థిక స్తోమత లేక ఇల్లు నిర్మించుకోకుండ స్థలానికి చుట్టూ ప్రహరీగా ఫినిషింగ్ కట్టాడు కాగా బాధితుని స్థలం పక్కన గల సయ్యద్ యాకుబ్, సయ్యద్ అల్లాద్దీన్, సయ్యద్ అఫ్రీన్, సయ్యద్ ఇసుభి,సయ్యద్ హాసీనా, సయ్యద్ యాఖుబ్ అనే ఆరుగురు వేక్తులు ఈ స్థలం కూడా మాదే అంటూ కబ్జా చేసి అందులో గృహ నిర్మాణం చేసుకోకుండా ఎవ్వరికి ఖరీదు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని. ఆవేదన వెక్తం చేసారు. మా భూమిపై కన్నేసి కబ్జా చేసి కొందరు అధికారులను అడ్డుపెటుకొని అసలైన పేపర్లు తరుమారు చేసి నకిలీ పత్రాలు సృష్టించి తమపై దాడికి దిగుతున్నారని తెలిపారు. సోమవారం గ్రామ పంచాయతీ వద్దకు పిలిపిస్తే రాకుండా తప్పించుకొని పోయారు. మా స్థలం వద్దకు మేము వెళ్లి శుభ్రం చేస్తున్న క్రమంలో మాపై దాడికి దిగి తీవ్రంగా కొట్టారని తెలిపారు.ఇదే విషయంపై అధికారులను అడిగినా ఎవరూ పట్టించు కోవడం లేదన్నారు.ఈ స్థలం మేదే ఇక్కడి నుండి వెళ్లాలని తమపై దౌర్జన్యానికి పాల్పడ్డార న్నారు. ఇదేమని ప్రశ్నిస్తే కర్రలతో, రాళ్లతో దాడిచేసి తలలు పగలగొ ట్టారని కన్నీటిపర్యం తమయ్యారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమ భూమీ ని తిరిగి వచ్చే విదంగా తమకు న్యాయం చేయాలన్నారు. ఆ భూములు లేకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని తీవ్ర ఆవేదన చెందారు.

# రేపటి నుండి కాంగ్రెస్ పాలనపై బీ ఆర్ ఎస్ నిరసన కార్యక్రమాలు

- **1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం దగా పాలన పై మాజీ ఎమ్మెల్యే గండ్ర**

**భూపాలపల్లి ఆగస్టు 31 పీపుల్స్ డైరీ..** 1000 రోజుల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం యొక్క దగా పాలనపై సెప్టెంబర్ 2వ తారీఖు నుండి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ సమరభేరి కార్యక్రమం పై నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారు మరియు వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ ఁ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి గారు.

### ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు తెలంగాణ ప్రజలకు 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నప్పటికీ అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు.ఆనాడు కాంగ్రెస్ నాయకులు స్వయంగా 6 గ్యారెంటీల కార్డులను ముద్రించి ప్రజలకు అందజేస్తూ, ఈ కార్డును జాగ్రత్తగా దాచుకోవాలని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలన్నింటినీ అమలు చేస్తామని భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. ఆ మాటలను నమ్మిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకొచ్చారని తెలిపారు.రాష్ట్ర జనాభాలో సగభాగం ఉన్న మహిళలను ఆకట్టుకోవడానికి ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ నేటికీ ఆ హామీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు.అదేవిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కళ్యాణలక్ష్మి పథకానికి అదనంగా తులం బంగారం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ ఆ హామీ పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రస్తుతం అందుతున్న పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని తెలిపారు. కానీ ప్రభుత్వం ఏర్పడి దాదాపు 1000 రోజులు పూర్తవుతున్నా పెన్షన్ పెంపు హామీ అమలుకు నోచుకోలేదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు ద్వారా అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని పెంచి ఎకరాకు రూ.15,000 అందిస్తామని, అవసరమైతే అదనపు పంటలకు కూడా సహాయం అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.అయితే నేడు రైతులకు ఇవ్వాల్సిన పెట్టుబడి సహాయం విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రైతు బీమా ప్రీమియం, యూరియా సరఫరా, సాగునీరు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ వంటి అంశాల్లో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించామని, కానీ ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ సరఫరాపై రైతుల్లో అనేక సందేహాలు, ఆందోళనలు ఉన్నాయని పేర్కొన్నారు.



### సాగునీటి రంగాన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారు

తెలంగాణను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుల మరమ్మతులు, నిర్వహణ, నీటి నిల్వ వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకుని రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతాంగం యూరియా కొరత, సాగునీటి సమస్యలు, భూముల నిషేధిత జాబితా వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు.

### రైతులకు ఇబ్బందులు

రాష్ట్రంలోని అనేక భూములు 22-A నిషేధిత జాబితాలో ఉండటం వల్ల రైతులు, భూ యజమానులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని, ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని అన్నారు. కానీ నేటికీ నిరుద్యోగ యువత ఆశించిన స్థాయిలో ఉద్యోగాల భర్తీ జరగలేదని విమర్శించారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు టీసీలు, ఇతర ధ్రువపత్రాల కోసం కళాశాలలకు వెళ్లినప్పుడు ఫీజు బకాయిల సమస్య కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు.

### సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సింగరేణి కార్మికులకు ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మెడికల్ బోర్డుల ద్వారా అనేక మంది కార్మిక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించామని, ప్రస్తుతం ఆ ప్రక్రియలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

### పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి నిలిచిపోయాయి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం, వీధి దీపాలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు.

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రాములు




**హసన్‌పర్తి, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ):** ప్రజలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రాములు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా కమిటీ పిలుపు మేరకు సోమవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన విద్య, మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. రేషన్‌కార్డుదారులకు 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని, పెన్షన్లు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు.రైతులకు సాగునీరు అందించడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని, గృహ, భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, హక్కులు అందే వరకు సీపీఐ(ఎం)ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని జి. రాములు తెలిపారు.కార్యక్రమంలో సీపీఐ(ఎం) హసన్‌పర్తి మండల కార్యదర్శి వేల్పు రజిత, మండల కమిటీ సభ్యులు పుల్ల అశోక్, మంద సుదందర్, పార్టీ కార్యకర్తలు మెట్టు సమ్మన్న, పల్లె వందన, లక్ష్మి, రవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'.. సభలో బోరున విలపించిన కవిత

- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు.కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు. ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.



# రోడ్డు పై నాటువేసి గ్రామస్తుల నిరసన

### బురద రోడ్డు తో ఇబ్బంది పడుతున్న ప్రజలు..




**రేగొండ ఆగస్టు 31 పీపుల్స్ డైరీ..** చినుకు పడితే చాలు రోడ్లు బురద మయంగా మారుతున్నాయని రోజులు సంవత్సరాలనుండి మట్టి రోడ్డు తో ఇబ్బంది పడుతున్నామని బురద రోడ్డు పై నాట్లు వేసి నిరసన తెలిపిన నారాయణ పూర్ గ్రామస్తులు. రేగొండ మండలంలోని నారాయణపురం గ్రామం లోనీ ప్రధాన రహదారిపై బురదమయం కావడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మరమ్మత్తుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో నిరసనగా రోడ్డుపై వరి నాట్లు వేశారు.గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి బురదమయంగా మారిందని, దీంతో వాహనాలు, పాదచారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఈ రోడ్డుపై వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# 'టాక్సిక్'లో అవేం సీన్లు..

### 'టాక్సిక్'పై రాజాసింగ్ తీవ్ర విమర్శలు,,.'ఇరుముడి', 'ఛావా' చిత్రాలను ప్రశంసించిన రాజాసింగ్



యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకొచ్చింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర విమర్శలు చేశారు. సినిమాలోని కొన్ని సన్నివేశాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదేం అశ్లీలత అంటూ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.సినీ పరిశ్రమ సమాజానికి ఉపయోగపడే మంచి సందేశాత్మక చిత్రాలు తీయాలని రాజాసింగ్ సూచించారు. దర్శకులు హింస, అశ్లీలతను మాత్రమే నమ్ముకోకుండా సమాజాన్ని దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. ధర్మం, భక్తి పెంపొందించేలా సినిమాలు రూపొందించాలని పిలుపునిచ్చారు.టాక్సిక్ సినిమా చూడటానికి తాను థియేటర్‌కు వెళ్లానని రాజాసింగ్ తెలిపారు. అయితే సినిమాలోని అశ్లీలత, తీవ్ర హింసను భరించలేక మధ్యలోనే బయటకు వచ్చేశానని చెప్పారు. యశ్ వంటి అగ్ర కథానాయకులు కుటుంబంతో కలిసి చూసేలా మంచి సినిమాలు చేయాలని సూచించారు.సమాజంలో ధర్మం, భక్తి, బాధ్యత పెంచే చిత్రాలు అవసరమని రాజాసింగ్ అన్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి', 'ఛావా' సినిమాలను ఆయన ఉదాహరణగా చెప్పారు. 'ఇరుముడి'లో ఆధ్యాత్మికత, సామాజిక బాధ్యత కనిపిస్తాయని ప్రశంసించారు. 'ఛావా'లో ధైర్యం, దేశభక్తి వంటి అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఇదిలా ఉంటే 'టాక్సిక్' విడుదలైన తొలిరోజే నెగెటివ్ టాక్ తెచ్చుకుంది. అయినప్పటికీ వసూళ్ల పరంగా సినిమా మంచి ఫలితాలు సాధిస్తుండటం గమనార్హం.

# రేవంత్ క్యాబినెట్‌లో మంత్రులకు స్వేచ్ఛ లేదా?

### కూనంనేని సంచలన వ్యాఖ్యలు



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి క్యాబినెట్‌లో మంత్రులకు పూర్తిస్థాయి స్వేచ్ఛ లేదని అన్నారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అధికారం, హక్కులతో పనిచేసే అవకాశం కల్పించాలని సూచించారు. వారికి తగిన స్వేచ్ఛ ఇవ్వకపోతే రానున్న రోజుల్లో కొత్త సమస్యలు తెరపైకి వచ్చి ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు.మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలను కూనంనేని తప్పుబట్టారు. రాజకీయాల్లో విధానాలపై విమర్శలు చేయడం సహజమేనని అన్నారు. అయితే ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని స్పష్టం చేశారు.రాష్ట్రంలో భూ సమస్యలపైనా కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటి ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం అలసత్వంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్య తీవ్రతను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు.నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# వినాయక చవితి వేళ భక్తులకు చిరంజీవి కీలక పిలుపు..!

### సీడ్ గణేశుడిని పూజించాలని చిరంజీవి పిలుపు



పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు కోసం ఈసారి సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించిన తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేస్తే.. ఆ విత్తనాల నుంచి మొక్కలు పెరిగి భవిష్యత్తులో మనల్ని ఆశీర్వదిస్తాయని తెలిపారు. 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' రూపొందించిన సీడ్ గణేశుడి ప్రతిమలను చిరంజీవి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఓ యజ్ఞంలా భావించి సంతోష్ కుమార్ పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఇప్పటికే లక్షల మందిని ప్రోత్సహించి 20 కోట్ల మొక్కలు నాటేలా చేయడం అభినందనీయమన్నారు. పచ్చదనం పెంపు కోసం ఆయన చేస్తున్న కృషికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
మంగళవారం, 1 సెప్టెంబరు 2026
సంపుటి : 18, సంచిక : 169


# హైదరాబాద్‌లో కానిస్టేబుల్ బలవన్మరణం

**లవ్ ఫెయిల్యూరే కారణమా?.ఆత్మహత్యకు ముందు స్నేహితులకు వాట్సాప్ సందేశం**



హైదరాబాద్ నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రేమ విఫలమవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. తిరుమలనగర్‌లో నివసించే నిభాష్ (25) పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంతకాలంగా అతను ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని భావించిన నిభాష్‌కు యువతి కుటుంబ సభ్యుల నుంచి నిరాకరణ ఎదురైంది. వారు వారి పెళ్లికి అంగీకరించకపోవడంతో నిభాష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే రాత్రి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే, ఆత్మహత్య చేసుకునే ముందు ఈ విషయాన్ని తన స్నేహితులకు వాట్సాప్ ద్వారా తెలియజేశాడు. ఉదయం అతని స్నేహితులు ఇంటికి వచ్చి చూడగా, నిభాష్ విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రేమ వ్యవహారమే ఈ ఆత్మహత్యకు ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు.

# క్షుద్రపూజల నెపంతో వ్యక్తి హత్య

**మృతుడు మెహబూబ్ అలీ సాహెబ్ (55)గా గుర్తింపు**



కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఫలక్‌నుమా పోలీసులు నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసిన ఎంఐఎం నేతలు హైదరాబాద్ నగరంలో మరో ఘోరం వెలుగుచూసింది. క్షుద్రపూజలు చేస్తున్నాడనే అనుమానంతో 55 ఏళ్ల వ్యక్తిని దుండగులు కిరాతకంగా హత్య చేశారు. చంపాపేట పరిధిలోని గుండాల షా బాబా రోడ్డులో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడిని మెహబూబ్ అలీ సాహెబ్ అలియాస్ ఉమర్‌గా పోలీసులు గుర్తించారు. ఈ హత్యపై సమాచారం అందుకున్న ఫలక్‌నుమా పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం ప్రక్రియ ముగిసిన అనంతరం భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ఈ ఘటనపై ఎంఐఎం నేతలు తీవ్రంగా స్పందించారు. మృతుడి సోదరుడిని, ఇతర కుటుంబ సభ్యులను వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ జావేద్ అలీ, సీఐలతో సమావేశమై చర్చించారు. ఈ హత్యలో ప్రమేయం ఉన్న నలుగురు నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా దర్యాప్తును పారదర్శకంగా చేపట్టాలని, సాక్షులకు రక్షణ కల్పించాలని కోరారు. నగరంలో పెరుగుతున్న నేరాల దృష్ట్యా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణలో చురుగ్గా రుతుపవనాలు.. పలు జిల్లాలకు హెచ్చరిక

**తెలంగాణలో పలు జిల్లాలకు యెల్లో అలర్ట్ జారీ**



బంగాళాఖాతం ప్రభావంతో చురుగ్గా రుతుపవనాలు ఉత్తర, తూర్పు జిల్లాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు గంటకు 30–40 కి.మీ వేగంతో ఈదురుగాలుల హెచ్చరిక హైదరాబాద్‌లో సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు చురుగ్గా కదులుతుండటంతో పలు జిల్లాలకు 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, దానికి అనుబంధంగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగిలిన ప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు పడతాయని పేర్కొంది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఇక హైదరాబాద్ నగరంలో ఈరోజు మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో పలు చోట్ల ఉరుములతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# కరాటే పోటీలో జెస్సిక ప్రతిభ



**హుజూరాబాద్, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ పట్టణంలో టైగర్ పంచ్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఔఖీూఖూ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండా శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కరాటే క్రీడాకారులను అభినందిస్తూ, క్రీడల్లో రాణించేందుకు వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు కాగా, హుజూరాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన అందె స్వప్న--అశోక్ దంపతుల కుమార్తె అందె జెస్సిక కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా బండా శ్రీనివాస్ చేతుల మీదుగా జెస్సిక కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. జెస్సిక కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విషయం తెలుసుకున్న గాంధీనగర్ కాలనీ వాసులు ఆమెను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఏపీలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం.. రేవంత్ రెడ్డిపై హరీశ రావు ఫైర్

- వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి రేవంత్ విఫలమయ్యారని ధ్వజం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్
- కృష్ణా బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందని హరీశ్ రావు ఆక్షేపణ



మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జలాలను అక్రమంగా తరలిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషించడం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. వరద నీరు లేకున్నా, ఎటువంటి కేటాయింపులు లేకుండానే కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాంతాలకు ఏపీ ప్రభుత్వం వెలిగొండ ద్వారా నీటిని యథేచ్ఛగా తరలిస్తోందని హరీశ్ రావు ఆక్షేపించారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు. ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. ఇది ఏపీకి పరోక్షంగా సహకరించడమేనని ఆరోపించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సైతం నిర్లిప్తంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ వివాదంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపేలా చూడాలని, తద్వారా ఆయకట్టుకు నీరందించాలని కోరారు.

# మజ్లిస్ నుంచి బహిష్కరణ.. ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ మిస్సింగ్ కలకలం!

- ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ అదృశ్యం
- మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలతో తీవ్ర వివాదంలో బేగ్
- ఆరోపణలు అవాస్తవం, డీప్‌ఫేక్‌లతో కుట్ర చేస్తున్నారని ఆయన వెల్లడి
- ఘటనపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ, బీఆర్ఎస్ డిమాండ్



ఎంఐఎం నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ అదృశ్యం కావడం హైదరాబాద్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఉమ్రా యాత్ర ముగించుకుని శనివారం నగరానికి చేరుకున్న ఆయన, అప్పటి నుంచి కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఇప్పటికే పలు తీవ్రమైన ఆరోపణలతో వివాదాల్లో చిక్కుకున్న ఆయన అదృశ్యం కావడం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. క్రమశిక్షణా చర్యల భాగంగా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరిస్తున్నట్లు ఇటీవల ఎంఐఎం ప్రకటించింది. అంతేకాకుండా, ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేయాలని పార్టీ అధిష్ఠానం ఆయనను ఆదేశించింది. అయితే, రాజీనామా చేసేందుకు నిరాకరించిన ఆయన, తాను ఎంఐఎం కార్యకర్తగానే కొనసాగుతానని అప్పట్లో స్పష్టం చేశారు. రహ్మత్ బేగ్ ఒక మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే, ఈ ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తనను అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు కావాలనే మార్ఫింగ్, డీప్‌ఫేక్ వీడియోలు, ఫోటోలను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గుర్తుతెలియని వ్యక్తులు డబ్బుల కోసం తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, దీనిపై ఇప్పటికే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తనకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వివాదంపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు స్పందిస్తూ, ఆరోపణలపై పారదర్శకంగా, సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. తెలంగాణ ప్రభుత్వం ఈ అంశంపై నిష్పక్షపాత విచారణకు ఆదేశించి, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ కోరారు. ఈ వరుస వివాదాల నేపథ్యంలో రహ్మత్ బేగ్ అదృశ్యం కావడం ఈ వ్యవహారాన్ని మరింత సంక్లిష్టంగా మార్చింది.

# హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం

- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి క్రికెట్ స్టేడియం
- గుజరాత్‌లోని మోదీ స్టేడియంను మించిన సామర్థ్యంతో నిర్మాణం
- 100 ఎకరాల భూమిని ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం
- నిర్మాణ, నిర్వహణ ఖర్చులను భరించనున్న బీసీసీఐ
- డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు



హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఆయన ఆదేశాలతో అధికారులు ఇప్పటికే అనువైన స్థలం కోసం అన్వేషణ ప్రారంభించారు. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ భారీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా గుజరాత్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం (1,32,000 సీటింగ్ సామర్థ్యం) ఉంది. దీనిని మించిపోయేలా ఫ్యూచర్ సిటీలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో కొత్త స్టేడియం నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించనుండగా, నిర్మాణ, నిర్వహణ వ్యయాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) భరించనుంది. ఈ స్టేడియం నిర్మాణం కోసం ఎంపిక చేయబోయే ప్రాంతం ఔటర్ రింగ్ రోడ్డు, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు మార్గం, శంషాబాద్ విమానాశ్రయానికి సమీపంలో ఉండేలా చూస్తున్నారు. దీనివల్ల ప్రేక్షకులు సులభంగా రాకపోకలు సాగించవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఫ్యూచర్ సిటీలో రానున్న స్పోర్ట్స్ సిటీ, టూరిజం, నెట్ జీరో సిటీ కాన్సెప్ట్‌లో ఈ క్రీడా ప్రాంగణం ఒక కీలక ఆకర్షణగా నిలవనుంది. కేవలం క్రికెట్‌కే కాకుండా, ఫుట్‌బాల్ మ్యాచ్‌లు, భారీ సంగీత కచేరీలు (కాన్సర్ట్‌లు) నిర్వహిం చేందుకు వీలుగా దీనిని మల్టీపర్పస్ వేదికగా తీర్చి దిద్దనున్నారు.

# హుజూరాబాద్‌లో టీఆర్‌పీలోకి భారీగా చేరికలు



- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నుంచి 50 మందికి పైగా కార్యకర్తలు చేరిక
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన తీన్మార్ మల్లన్న

**హుజూరాబాద్, ఆగస్టు 31 (పీపుల్స్ డైలీ) :** హుజూరాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ)లోకి వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీగా చేరారు. హుజూరాబాద్ మండలం రంగాపూర్, కాట్రపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 50 మందికి పైగా కార్యకర్తలు సోమవారం తీన్మార్ మల్లన్న సమక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న నూతనంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ బలోపేతం, మండల స్థాయిలో కార్యకలాపాల విస్తరణపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా హుజూరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడిగా తిరగమల్ల నాగార్జునను, ప్రధాన కార్యదర్శిగా మాడుగుల రాజును నియమించారు.

**ప్రతి గ్రామానికి పార్టీని తీసుకెళ్తా: తిరగమల్ల నాగార్జున**

హుజూరాబాద్ మండల పార్టీ అధ్యక్షుడిగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు తిరగమల్ల నాగార్జున తీన్మార్ మల్లన్నకు, పార్టీ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు కష్టపడి పనిచేస్తానని చెప్పారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీని హుజూరాబాద్ మండలంలోని ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చే వరకు తీన్మార్ మల్లన్న అడుగుజాడల్లో నడుస్తూ కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, కొత్తపల్లి మండల అధ్యక్షురాలు ఓర్సు విమల, వేణుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. హుజూరాబాద్ మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని నాయకులు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు చేరువయ్యేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొడ్డు సురేష్, బొడ్డు దేవదాసు, బొడ్డు శ్రీనివాస్, బొడ్డు సుమన్, బొడ్డు శ్రీను, మైస కుమారస్వామి, మైస శ్రీనివాస్, వేల్పుల శ్రీనివాస్, మైస సంపత్, మైస రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్స్ నూతన భవనాలకు శంకుస్థాపన చేసిన మంత్రి

- ఇప్పుడు సెకండ్ ఇయర్స్ లో 120 మంది చేరారు.
- ఐటీ లో జీరో ఉంటే 175 కి చేరింది..
- మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్స్ లు తీసుకొస్తాం..
- వచ్చే విద్యా సంవత్సరం లోపు స్ట్రెంత్ ఫుల్ అవుతుంది..
- ఇప్పటికే విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నాం..
- కాలేజీ హాస్టల్ లోనే లైబ్రరీ పెట్టిస్తాం..



**హుస్నాబాద్ టౌన్ : (పీపుల్స్ డైరీ)** ఆగస్టు 31 సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఉమ్మాపూర్ లో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల బాలుర ,బాలికల హాస్టల్స్ నూతన భవనాలకు శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక్కో హాస్టల్ కి 7.28 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 14.56 కోట్ల రూపాయల వ్యయంతో హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ బాలుర డ బాలికల హాస్టల్ కి శంకుస్థాపన చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వీసీ ఉమేష్ కుమార్ , రిజిస్ట్రార్ , ప్రిన్సిపల్ , కౌన్సిలర్ లు , మార్కెట్ కమిటీ చైర్మన్ లు , సర్పంచ్ లు మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ పాఠశాల 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హుస్నాబాద్ కి ఏదైనా యూనివర్సిటీ వస్తె బాగుండు అనే మాట వ్యక్తం చేశారు.. అప్పుడు వెంటనే హుస్నాబాద్ కి ఇంజనీరింగ్ కాలేజీ కావాలని ప్రతిపాదనలు చేశాం పెద్దపల్లి కీ ముఖ్యమంత్రి వచ్చినప్పుడు కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ కి ఎల్ఎల్బి , ఎల్ఎల్ఎం, ఫార్మసీ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ అడగగానే ముఖ్యమంత్రి మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన కాలేజీ లను పట్టుదలతో మంజూరు చేసుకున్నాం.కేబినెట్ లో ఇంజనీరింగ్ కాలేజీ అప్రూవల్ చేసుకొని, స్థలం అప్రూవల్ చేసుకొని భవనాలకు నిధులు మంజూరు చేసుకున్నాం.ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాల భవనాలకు శంకుస్థాపన చేసుకున్నాం.ఇప్పుడు హాస్టల్ భవనాలకు శంకుస్థాపన చేసుకున్నాం మొదటి సంవత్సరంలో 240 మంది విద్యార్థులకు 60 మంది చేరితే సైకిళ్లు ,ల్యాప్ టాప్స్ అందించాం. మంచి నాణ్యమైన విద్య ప్రమాణాలు అందించడం కోసం రాజకీయ జోక్యం లేకుండా చూసుకున్నాం విద్యార్థులు బాగా చదువుకోవాలి మీకు ఏ సమస్య ఉన్నా స్థానిక ఎమ్మెల్యే గా కాకుండా మీకు గార్డియన్ గా ఉంటా..త్వరలో శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల కు రెండు బస్సులు రాబోతున్నాయి ఎవరైనా దాన గుణం ఉన్నవారు విద్యార్థులకు ల్యాప్ టాప్ లు ఇవ్వడం..బస్ వచ్చే వరకు ఇంకా ఏదైనా రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్న కోహెడ తంగలపల్లి లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలు వేగంగా నిర్మిస్తున్నాం.సైదాపూర్ లో మరో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ రాబోతుంది..ఇప్పటికే ూజ కి శంకుస్థాపన చేసుకున్నాం.. భీమదేవరపల్లి మండలంలో నవోదయ స్కూల్ రాబోతుంది చిగురు మామిడి లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాబోతుంది. ఎల్కతుర్తి బాసర ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ రాబోతుంది. హుస్నాబాద్ కబడ్డీ అకాడమీ వస్తుంది..మంచి స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తాం. పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం.. పక్కనే అర్బన్ ఫారెస్ట్ పార్క్..ఎల్లమ్మ చెరువు బ్యూటిఫికేషన్ చేస్తున్నాం. మీరు మంచి ర్యాంకులు తెచ్చుకోవాలి.. మౌలిక సదుపాయాలు నేను కల్పిస్త. విద్యా బోధనలో అకడమిక్ సైడ్ లో చిన్న లోటు ఉన్న వైస్ చాన్సలర్ బాధ్యత. మీకు ఏ సమస్య ఉన్న ఎడ్యుకేషన్ గార్డియన్ ఆయన దృష్టికి తీసుకుపోండి మంచి మార్కులు సాధించాలి..అందరూ ఉన్నత స్థాయికి చేరుకోవాలి భవన నిర్మాణాలు ఏడాది లోపు పూర్తి చేస్తామని వాళ్లు హామీ ఇచ్చారు.. నియోజకవర్గంకి ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తాం. ఎల్లమ్మ చెరువు గ్లాస్ బ్రిడ్జి విస్తృత ప్రచారం కావడం వల్ల విజిటర్స్ చాలా మంది వస్తున్నారు. పందిళ్ల నుండి ఎల్లమ్మ చెరువు ..మల్లె చెట్టు చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వైపు రోడ్డు నిర్మిస్తాం. విద్యా ,వైద్యం ,వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తున్నాం. నేను విద్యార్థి నాయకుడిని కాబట్టి ఇక్కడికి ఇంజనీరింగ్ కళాశాల వచ్చింది.మీరు ఇక్కడి నుండి జాబ్ తోనే బయటకు పోవాలి ఇంజనీరింగ్ కాలేజీ కి అప్రోచ్ రోడ్డు వేస్తున్నాం.. ఆటోమేటిక్ గా స్ట్రీట్ లైట్స్ వస్తాయి. పోతారం నుండి ఇక్కడికి నాగారం మీదుగా కూడా స్ట్రీట్ లైట్స్ వేస్తున్నాం. హుస్నాబాద్ ప్రాంతానికి సంబంధించిన విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలి.. రేపటి భవిష్యత్ లో మంచి ప్లేస్ మెంట్ వస్తాయి..ఉద్యోగ అవకాశాలు వస్తాయి..

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు కార్యక్రమం

- హుస్నాబాద్ మున్సిపాలిటీలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు కార్యక్రమం




**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) ఆగస్టు 31 :** హుస్నాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుధ్య సిబ్బందికి ప్రత్యేకంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు.మహిళా పారిశుధ్య సిబ్బంది ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, సిబ్బందిలో ఐక్యత మరియు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.క్రీడా పోటీలలో విజయం సాధించిన మహిళా పారిశుధ్య సిబ్బందికి హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి గారి చేతుల మీదుగా షీల్డులు అందజేసి అభినందించారు. పారిశుధ్య నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న మహిళా పారిశుధ్య సిబ్బందిని ప్రోత్సహించేందుకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని చైర్‌పర్సన్ దండి లక్ష్మి గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ గారు, కౌన్సిలర్స్ అనూష గారు, మంజుల గారు, వరప్రసాద్ గారు, రమేష్ గారు, గాదెపాక రవీందర్ గారు, బత్తుల స్వరూప గారు, శోభన్ బాబు గారు, కో ఆప్షన్ సభ్యులు హసన్ గారు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- ప్రజా ప్రభుత్వంలో ప్రతి వర్గాన్నీ ఆదుకుంటున్నాం: మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని
- హుజూరాబాద్‌లో 250 కుట్టు మిషన్ల పంపిణీ



**హుజూరాబాద్ ఆగస్టు 31,( పీపుల్స్ డైరీ):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు అన్నారు. మైనారిటీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలో మైనారిటీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు 250 కుట్టు మిషన్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని లబ్ధిదారులకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. కుట్టు మిషన్ల పంపిణీ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందుతూ తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మైనారిటీల అభ్యున్నతికి రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆమె తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని మైనారిటీలకు 250 కుట్టు మిషన్లు అందేలా కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి అజారుద్దీన్, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్కు నియోజకవర్గ మైనారిటీల పక్షాన ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కుట్టు మిషన్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ద్వారా తమకు స్వయం ఉపాధి లభించడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుచుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్డీఓ జలకుమారి, ఎమ్మార్వో నరేందర్, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనారిటీ వర్గాల ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కరాటే క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం

**విజేతలకు బహుమతులు అందజేసిన వొడితల ప్రణవ్, రొంటాల సుహాసిని**



**హుజూరాబాద్ ఆగస్టు 31, ( పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ పట్టణంలో టైగర్ పంచ్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఔఖీఖూ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన కరాటే క్రీడాకారులకు ముఖ్య అతిథులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందిం చారు. క్రీడాకారుల ప్రతిభను ప్రశంసిస్తూ, చిన్న వయసు నుంచే విద్యతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవడం ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ యువతలో ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదల వంటి లక్షణాలను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. స్థానికంగా క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వాహకులు చేస్తున్న కృషిని అభినందించారు. సౌత్ ఇండియా స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, కోచ్‌లు, నిర్వాహకులను ముఖ్య అతిథులు అభినందిం చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్, మండల ప్రెసిడెంట్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కరాటే కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అమాయకులపై దాడి చేసిన కోదాడ సిఐ శివశంకర్‌ను డిస్మిస్ చేయాలి

**అంబేద్కర్ సంఘం భీమదేవరపల్లి మండల కన్వీనర్ బొల్లంపల్లి రాజు డిమాండ్**



**భీమదేవరపల్లి (ఆగస్టు 31) :** కోదాడలో అమాయకుడైన మండల ఉపేందర్‌పై భౌతిక దాడికి పాల్పడి, కారు డిక్కిలో బలవంతంగా ఇసుక కుక్కి తప్పుడు కేసులు బనాయించిన సిఐ శివశంకర్ వైఖరిని అంబేద్కర్ సంఘం తీవ్రంగా ఖండిస్తోందని మండల కన్వీనర్ బొల్లంపల్లి రాజు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ కల్పించాల్సిన పోలీసులే వీధి రౌడీల కంటే దారుణంగా వ్యవహరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఘటనను చిత్రీకరిస్తున్న జర్నలిస్టుపై సిఐ చేయి చేసుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. జర్నలిస్టులకే భద్రత లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒంటిపై కాకి చొక్కా ఉందనే అహంకారంతో తెలంగాణ వ్యాప్తంగా పలువురు అధికారులు అమాయక ప్రజలపై వీరంగం సృష్టిస్తున్నారని విమర్శి ంచారు.బాధ్యుడైన కోదాడ సిఐ శివశంకర్‌ను వెంటనే సస్పెండ్ చేయడమే కాకుండా, ఉద్యోగం నుండి శాశ్వతంగా డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుపై దాడి చేసినందుకు, అమాయకులపై తప్పుడు కేసులు బనాయి ంచినందుకు సిఐపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.తెలంగాణ రాష్ట్ర డిజిపి ఈ ఘటనపై తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించాలని, భవిష్యత్తులో ఇలాంటి పోలీసు దాష్టీకాలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

# అనారోగ్యంతో భర్తను కోల్పోయిన రజితకు క్లాస్‌మేట్స్ ఆర్థిక సాయం



**హుజూరాబాద్ ఆగస్టు 31, ( పీపుల్స్ డైరీ):** రాంపూర్ గ్రామానికి చెందిన తమ పదో తరగతి క్లాస్‌మేట్ కొక్కుల రజిత భర్త అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె క్లాస్‌మేట్స్ మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. రజిత కుటుంబ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తమ వంతు సహాయంగా రూ.20,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా క్లాస్‌మేట్స్ మాట్లాడుతూ.. ఆపద సమయంలో తమ స్నేహితురాలికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి అందరూ కలిసి ఈ ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా రజిత కుటుంబానికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఆపదలో ఉన్న సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన క్లాస్‌మేట్స్‌కు రజిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లాస్‌మేట్స్ ఎల్లయ్య, మిడిదొడ్డి రాజు, నవీన్, రావుల సురేష్, జెట్టి నరేష్, అనిత, పుష్పలత, వనజ తదితరులు పాల్గొన్నారు

# అక్రమ లేఅవుట్ లలో ప్లాట్ల విక్రయాలపై 'ప్రజావాణి'లో ఫిర్యాదు



**భీమదేవరపల్లి, ఆగస్టు 31:(పీపుల్స్ డైరీ ) :** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 266 లో నిబంధనలకు విరుద్ధంగా,ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఫ్లాట్లు విక్రయిస్తున్న వారిపై మండల స్థాయి ప్రజావాణి (గ్రీవెన్స్) లో ఫిర్యాదు చేసినట్లు 8వ వార్డు మెంబర్ నడిగోటి నరేష్ తెలిపారు.దళారుల మాటలు నమ్మి సామాన్య ప్రజలు మోసపోవద్దని ఆయన హెచ్చరించారు.ఈ సందర్భంగా నడిగోటి నరేష్ మాట్లాడుతూ... వ్యవసాయ భూములను అక్రమంగా ఫ్లాట్లుగా మార్చి విక్రయించడం కొందరికి వ్యాపారంగా మారిందని, దీనివల్ల కష్టపడి కూడబెట్టుకున్న సొమ్ముతో స్థలాలు కొనే సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు లింక్ డాక్యుమెంట్లు, నాలా కన్వర్షన్, ఈసీ, పహాణీ వంటి పత్రాలను సమగ్రంగా సరిచూసుకోవాలి.గ్రామపంచాయతీ, ప్రభుత్వ సంబంధిత శాఖల నుండి అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయో లేదో నిర్ధారించుకున్నాకే నగదు చెల్లించాలి.గ్రామపంచాయతీకి, ప్రభుత్వానికి రావలసిన పన్నులను ఎగవేస్తూ అక్రమ వ్యాపారాలు చేసేవారికి కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు మద్దతు ఇవ్వడం తగదని ఆయన విజ్ఞప్తి చేశారు. అక్రమ లేఅవుట్‌లపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కేశవపట్నం బస్టాండులో గుంతలను పూడ్చిన సర్పంచ్ రాజేంద్రప్రసాద్



**శంకరపట్నం ఆగస్టు : 31 పీపుల్స్ డైరీ:** శంకరపట్నం మండలం కేశవపట్నం బస్టాండ్ లో పరిసరాలలో స్థానిక సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ చొరవ తీసుకొని గుంతలను ట్రాక్టర్ తో చదును చేయించారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆకు బత్తిని విజయకుమార్, బస్టాండ్ గైడ్ హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి, సెక్యూరిటీ హరిమ్యాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం:ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

### వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై సమరభేరి



**హుజూరాబాద్, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 'సమరభేరి' పేరుతో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూ-ర్తవుతున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. సెప్టెంబర్ 2న హుజూరాబాద్‌లో ఉదయం 10 గంటలకు చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించడంతో పాటు 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 3న వీణవంకలో రైతుల సమస్యలు, సాగునీరు, విద్యుత్, యూరియా కొరత, రైతుబీమా తదితర అంశాలపై నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 4న కమలాపూర్‌లో మహిళలకు ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ వంటావార్పు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న జమ్మికుంటలో ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, నిరుద్యోగ సమస్యలపై నిరసన కార్యక్రమం నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 6న గ్రామపంచా యతీల సమస్యలు, పెండింగ్ బిల్లులు, మౌలిక వసతుల సమస్యలపై ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్‌లో ఉదయం 10 గంటలకు, జమ్మికుం టలో 11 గంటలకు, ఇల్లంతకుంటలో మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు పేర్కొన్నారు. ఆటో కార్మికులతో కలిసి ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 7న నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు చెప్పారు సెప్టెంబర్ 8న కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి 'సమరభేరి' కార్యక్రమాలను ముగించనున్నట్లు తెలిపారు.హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ పోరుకు జనసేన సై.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ

- తెలంగాణలో విస్తరణపై జనసేన దృష్టి
- గ్రేటర్ హైదరాబాద్ సహా మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో పోటీ
- డిసెంబర్‌లో జరగనున్న ఎన్నికలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపు
- ఈ ఎన్నికల ఫలితాలే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయన్న నేతలు
- ఇప్పటికే ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించిన జనసేన




తెలంగాణలో తమ రాజకీయ కార్యకలాపాలను విస్తరించే దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఎన్నికల్లో తమ పార్టీ బలంగా పోటీ చేస్తుందని జనసేన స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ తాళ్లూరి రామ్ అధికారికంగా ప్రకటన చేశారు. నిన్న హైదరాబాద్‌లోని జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో మూడు కార్పొరేషన్ల పరిధిలోని ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తాళ్లూరి రామ్ మాట్లాడుతూ.. "రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి జనసేన శ్రేణులు సిద్ధం కావాలి. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి" అని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. పోటీ చేసే అభ్యర్థులు ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుకు దిక్సూచిగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును జనసేన ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు గ్రేటర్ ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించడంతో తెలంగాణలో పార్టీని బలోపేతం చేయడంపై జనసేన అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రాధారం రాజలింగం, మచ్చ సుధాకర్, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, గడల శ్రీనివాస్‌తో పాటు పలువురు ఆశావహులు పాల్గొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ ఏడాది డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం వంటి బలమైన పార్టీలు బరిలో ఉండగా, ఇప్పుడు జనసేన కూడా పోటీలోకి దిగుతుండటంతో గ్రేటర్ పోరు మరింత రసవత్తరంగా మారనుంది.

# పదవీ విరమణ ఉద్యోగానికే తప్ప...వ్యక్తికి కాదు

- గిరిజన ఆశ్రమల పాఠశాల ఉపాధ్యాయుడు అశోక్ రాజు ఘనంగా పదవి విరమణ



**హుస్నాబాద్, టౌన్: (పీపుల్స్ డైరీ) ఆగస్టు 31 :** విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన ఉపాధ్యాయుడు అశోక్ రాజ్ అని సహ ఉపాధ్యాయుడు బిక్షపతి అన్నారు. పదవీ విరమణ సందర్భంగా విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అశోక రాజు మాట్లాడుతూ సహచర ఉపాధ్యాయుడు బిక్షపతి గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చేసిన సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. సోమవారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమం ఆత్మీయత, భావోద్వేగాల మధ్య ఘనంగా జరిగింది. "విరమణ పదవికి తప్ప... వ్యక్తికి కాదు" అంటూ పలువురు విద్యార్థులు అశోక్ రాజ్ తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, మానవీయ విలువలు, ఉన్నత లక్ష్యాల వైపు విద్యార్థులను నడిపించిన ఆయన సేవలను కొని యాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్,మంద శ్రీనివాస్, భూక్య శ్రీనివాస్, కొత్తపల్లి మహేందర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొని అశోక్ రాజ్ ను ఘనంగా సన్మానించి, ఆయన భవిష్యత్ జీవితం ఆనంద ంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.

# ఎంఈఓ సునీత విజయకుమార్‌కు తెలంగాణ అంబేద్కర్ సంఘం ఘనసన్మానం




**భీమదేవరపల్లి, ఆగస్టు 31: (పీపుల్స్ డైరీ ) :** భీమదేవరపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ)గా సుదీర్ఘ సేవలు అందించి పదవీ విరమణ పొందిన మారపల్లి సునీత విజయకుమార్ పత్రా ని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ మాట్లాడుతూ.. సునీత విజయ కుమార్ గారు ఎంఈఓ గా మండలంలోని వివిధ పాఠశాలలను నిరంతరం సందర్శిస్తూ, విద్యా ప్రమాణాల మెరుగుదలకు మరియు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు విశేష కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎల్లప్పుడూ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తూ విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులు, గురువులు మరియు పాఠశా లలకు మంచి పేరు తీసుకు రావాలని ఆమె నిరంతరం ప్రోత్సహించేవారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు, చెప్యాల ప్రకాష్, బొక్క కుమార్, తొందూరి ఎల్లయ్య, కండె సుధాకర్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఇంద్రానగర్ సర్పంచ్ అంబాల రాజకుమార్, కదారి రఘువరన్, మేకల సిద్ధార్థ్, చరణ్, బొల్లంపల్లి ప్రకాష్, మాడుగుల మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# వాహన మరమ్మతుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం!



**జగిత్యాల, ఆగస్టు 31:** వాహన మరమ్మతుల పేరుతో మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని 15వ వార్డు కౌన్సిలర్ అల్లాల సరిత-రమేష్‌రావు, 50వ వార్డు కౌన్సిలర్ ములస్తం లావణ్య-మహేష్ ఆరోపించారు. సోమవారం వారు మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ సమావేశంలో శానిటేషన్ విభాగం వాహనాలపై పలు అంశాలను ప్రస్తావించారు.జూలై నెలలో డీజిల్ ఖర్చు రూ.11.83 లక్షలు చూపించారని, గత నెలతో పోలిస్తే రూ.2.20 లక్షలు అదనంగా ఖర్చు కావడంపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనాలు నడవకున్నా నడిచినట్లు చూపిస్తూ, చిన్నపాటి మరమ్మతులకు లక్షల్లో బిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీలో మెకానిక్ ఉన్నప్పటికీ బయట రిపేర్ల పేరుతో ఖర్చులు చూపించడంపై ప్రశ్నించారు. జియో ట్యాగింగ్‌కు రూ.9 లక్షలు ఖర్చు చేసినా కొన్ని వాహనాలకే ట్యాగింగ్ ఉండటంపై అనుమానాలు వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో 294 మంది కార్మికులు ఉన్నప్పటికీ పనిచేసిన వారికి జీతాలు అందకపోవడం, పనిచేయని వారికి పూర్తి జీతాలు వస్తున్నట్లు ఆరోపించారు. కొందరికే బయోమెట్రిక్ హాజరు అమలు చేయడం సరికాదన్నారు. చింతకుంట చెరువులోకి మురుగు నీరు చేరడంతో నీరు కలుషితమై చేపలు మృతి చెందుతున్నాయని, మత్స్యకార కుటుంబాలు నష్టపోతున్నాయని తెలిపారు. గణపతి, బతుకమ్మ నిమజ్జనాలకు ఉపయోగించే చెరువును పరిరక్షించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అవినీతికి తావులేకుండా మున్సిపల్ పనులు పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

# ఘనంగా శ్రీనివాస్ బాబు పదవీ విరమణ సత్కారం

### అంకితభావంతో విధులు నిర్వర్తించారని కొనియాడిన అధికారులు



**సైదాపూర్ ఆగస్టు 31 ( పీపుల్స్ డైరీ) :** సైదాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన వి. శ్రీనివాస్ బాబు ఆత్మీయ వీడ్కోలు సమావేశం సోమవారం ఘనంగా జరిగింది. ఎంపీడీవో భూక్యా యాదగిరి ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. శ్రీనివాస్ బాబు తన సర్వీసు కాలంలో వృత్తి పట్ల ఎంతో అంకితభావంతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. తోటి సిబ్బందితో, ప్రజలతో ఆయన ఎంతో కలుపుగోలుగా ఉంటూ అందరి మన్ననలు పొందారని ప్రశంసించారు. అనంతరం ఆయనను శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ప పోతరాజు బబిత రాయిశెట్టి చంద్రయ్య ఎంపీవో ఎండీ భషీరుద్దీన్, ఏఈ డి ఈ ఎండీ మజీద్ హుస్సేన్, , ఉపాధి హామీ ఏపీవో రాణి, ఏపీఎం తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీపీ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

### సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ పోతరాజు బబిత



**సైదాపూర్ ఆగస్టు 31 ( పీపుల్స్ డైరీ ) :** ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెర్కపల్లి గ్రామ సర్పంచ్ పోతరాజు బబిత కోరారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆమె స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సాంకేతికతను వినియోగించుకుంటూ నకిలీలకు చెక్ పెట్టే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ స్మార్ట్ రేషన్ కార్డులను జారీ చేసిందని, వీటి ద్వారా సరుకుల పంపిణీ మరింత పారదర్శకంగా, సులభంగా జరుగుతుందని అన్నారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూడటమే పంచాయతీ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీవో రాజేందర్, అంగన్‌వాడీ టీచర్ సమత, , గ్రామస్థులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ డెయిరీ పాల సేకరణ ధరలు పెంపు

**భీమదేవరపల్లి ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ ) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ములుకనూర్ మహిళా డెయిరీ సభ్యులకు పాల సేకరణ ధరలను పెంచుతూ డెయిరీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. పెంచిన ధరలు సెప్టెంబర్ 1, 2026 ఉదయం నుంచి అమల్లోకి రానున్నాయి.డెయిరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ, జనరల్ మేనేజర్ మార్పటి భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సగటున ఆవు పాలకు లీటరుకు రూ.1.25, గేదె పాలకు లీటరుకు రూ.3.50 చొప్పున ధర పెంచినట్లు తెలిపారు.పాల ఉత్పత్తిదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ధరల పెంపు నిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొన్నారు. పెరిగిన ధరలతో డెయిరీ సభ్యులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జగిత్యాల జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

### సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు అమల్లో.. అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, సభలకు అనుమతి లేదు

**జగిత్యాల, ఆగస్టు 31:** జగిత్యాల లో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జగిత్యాల జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్--1861ను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడరాదని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ అమలుకు జిల్లా ప్రజలు సహకరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న పోలీసు సిబ్బందికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.

# మత్స్య సహకార సంఘం చైర్మన్‌గా తూడి లచ్చన్న



**జగిత్యాల, ఆగస్టు 31:** గంగాధర మండలంలోని మల్లాపూర్ ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ నూతన చైర్మన్‌గా తూడి లచ్చన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు హాజరై ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి, లచ్చన్నకు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, మత్స్యకారులు ఆయనను అభినందించారు. సంఘం అభివృద్ధితో పాటు మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని తూడి లచ్చన్న తెలిపారు.

## కొత్త ఎఫ్ఆర్ఎస్ హాజరుపై దృష్టి సారించాలి

**డీఐఈఓ శ్రీధర్ సుమన్**



**మట్టెవాడ, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థుల హాజరుపై దృష్టి సారించడానికి నూతన ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలుపర్చాలని వరంగల్ జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ అన్నారు. సోమవారం ఇంటర్ విద్యా కార్యాలయం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు నూతన ముఖ గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) హాజరుపై గూగుల్ మీట్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసారి ముఖ గుర్తింపు రిజిస్ట్రేషన్, రోజువారీ హాజరు నమోదు, ఆన్ డ్యూటీ నమోదు, ప్రిన్సిపాళ్ల మానిటరింగ్, రిపోర్టింగ్ తదితర వివరాలు ఎప్పటికప్పుడు "టీజీబిఐఈ ఎఫ్ఆర్ఎస్ ఆప్" ద్వారా కొనసాగించనున్నట్లు తెలిపారు. నూతన ఆప్ లో మరిన్ని ఫీచర్లు జోడించడం వల్ల విద్యార్థుల హాజరు వేగంగా నమోదు అవుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 200 పైగా సిబ్బంది, 2,400 మంది విద్యార్థులకు ఈ హాజరు నమోదు అమలయ్యే అవకాశం ఉందని డిఐఈఓ అన్నారు. ఈ గూగుల్ మీట్ లో మాస్టర్ ట్రైనర్ కేశవ్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

**72 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్ వెంకన్న**



**మట్టెవాడ, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ):** ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యమని, దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా, సత్వరమే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు అందుతున్న సేవల్లో పారదర్శకత, జవాబుదారీ తనం పెంచే విధంగా అధికారులు పనిచేయాలని అన్నారు. గత వారం ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై విభాగాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్న కమిషనర్ పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే బల్దియా ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రెటరీ అనిల్ బాబు, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల బాధ్యత మరిచిన పిల్లలకు ఆస్తులు, అధికారాలు అడిగే హక్కు లేదు

**సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితారెడ్డి**



**మట్టెవాడ, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ):** కేయూ పక్కన గల లార్డ్ వృద్ధాశ్రమాన్ని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ కె.అనితా రెడ్డి సందర్శించారు. వృద్ధులను ఆత్మీయంగా పలకరించారు. అనంతరం వృద్ధుల చట్టం, ట్రిబ్యునల్ కోర్టుపై నాగరాని నరేష్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ అనితారెడ్డి మాట్లాడుతూ వయో వృద్దులకు వరం ట్రిబ్యునల్ బెంచ్ అని, వయోవృద్దులకు ఏ సమస్యలు లేదా వేధింపులకు గురైనా ట్రిబ్యునల్ బెంచ్ ని సంప్రదించాలని వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని అన్నారు. వయో వృద్దులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు బ్రతికి ఉండగా పిల్లలకు పూర్తిగా ఆస్తులన్నీ పంచకూడదని తమ అవసరాలకు ఉంచు కోవాలని తదనంతరం చెందేలా విల్లు రాయాలని ఆమె సూచించారు. తల్లిదండ్రుల బాధ్యత వద్దనుకున్న పిల్లలకు ఆస్తిని, అధికారాలను అడిగే హక్కు లేదని అన్నారు. తల్లి దండ్రులను ప్రేమించని వారు, ఇబ్బంది పెట్టే వారు ఎంతటి కోటీశ్వరులైన దరిద్రులతో సమానం అని అన్నారు. ఏదిఏమైనా తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదేనని మరువ కూడదని అనితారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు నాగరాని నరేష్, వృద్ధులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న గోవిందా గోవిందా నాటికలు..




**మట్టెవాడ, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ):** రోటరీక్లబ్ ఆఫ్ వరంగల్, ఓరుగల్లు శారద నాట్యమండలి సహకారంతో ఆదివారం రాత్రి వరంగల్ పోతన విజ్ఞాన పీఠంలో నిర్వహించిన సంయుక్త సాంస్కృతిక కార్యక్రమాలు విజయవంతం అయ్యాయి. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ శారు ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా వ్యవహరించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమ నిర్వహణ చైర్మన్ గా బబ్బుల వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు ప్రదర్శించిన రెండు అద్భుతమైన నాటికలు "గోవిందా గోవిందా!" హాస్య నాటిక, "థ్రిలింగ్" ఉత్కంఠ భరిత నాటిక వీక్షకులను ఆకట్టుకున్నాయి. రోటరీ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఈ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని ఆహ్లాదకరంగా వీక్షించారు. కార్యక్రమ నిర్వహణకి ఆర్థికంగా సహకరించిన సభ్యులకు రోటరీక్లబ్ ఆఫ్ వరంగల్ పక్షాన అనంతుల కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ వరంగల్ అధ్యక్షులు అనంతుల కుమారస్వామి, కార్యదర్శి చందా రఘువీర్, కోశాధికారి చెరుకు రాజేందర్ రెడ్డి, సభ్యులు బబ్బుల వెంకటేశ్వర్లు, కొండూరు శివప్రసాద్, సరాబు వసంత్, బబ్బుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన కంటి వైద్యం అందించడమే లక్ష్యం

**ఎర్రబెల్లి ప్రదీప్ రావు**



**మట్టెవాడ, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రాజశ్రీ గార్డెన్స్ లో ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో సోమవారం నిర్వహించిన మహా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 1,500 మంది పేద, మధ్యతరగతి ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని సుమారు 1500 మంది పేద మధ్యతరగతి ప్రజలు పాల్గొని 1000 మందికి పైగా కంటి అద్దాలు అందించి, 100 మందిని కంటి రెటీనా, ఇతర సర్జరీలకై హైదరాబాదుకు తరలించడం జరిగిందన్నారు. ఇది 2వ విడత, మొదటి విడత కాశిబుగ్గలో నిర్వహించగా 2,000 మంది ఆపరేషన్ కు 200 మంది పాల్గొని విజయవంతం చేశారన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనేదే ఈ మా ట్రస్ట్ సంకల్పం అని ఎర్రబెల్లి తెలిపారు. ఈ శిబిరానికి సహకరించిన శంకర కంటి ఆసుపత్రి సిబ్బందికి, క్రీడో లైఫ్ సైన్స్ డైరెక్టర్ ఆలూరు వంశీకృష్ణకు ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ తక్కళ్ళపల్లి రాజేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, నాయకులు రావు పద్మ, ఎడ్ల అశోక్ రెడ్డి, వన్నాల వెంకటరమణ, డాక్టర్ కాళీప్రసాద్, పుల్లారావు, దాస్యం అభినవ్ భాస్కర్, గుజ్జుల వసంత మహేందర్, స్థానిక కార్యక్రమ నిర్వాహకులు మందా శ్రీనివాస్, కందిమల్ల మహేష్ మల్లాడి తిరుపతిరెడ్డి, బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాణా ప్రతాప్ రెడ్డి, సముద్రాల పరమేశ్వర్, బైరి మురళీకృష్ణ, కర్నె రవీందర్, పూజారి అజయ్, కోమాకుల నాగరాజు, బైరి నాగరాజు, కనుకుంట్ల రంజిత్, గోకె వెంకటేష్, ఆకుతోట రాజు, బోరిగం నాగరాజు, తాళ్లపల్లి అర్జున్, రఫీ, విప్ప సుధాకర్, బక్కి రంజిత్, షేర్ల అనిల్, పాలకుర్తి శేఖర్, కట్కూరి రాజేష్, సుధీర్, సాయి, కుమార్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు అభిమానులు పాల్గొన్నారు.

# ఇళ్లు కోల్పోయి.. అప్పులపాలు!

**నాలుగేళ్లుగా అందని బిల్లులు - ప్రజావాణిలో బాధితుల ఆవేదన**



**ఆత్మకూర్, ఆగస్టు 31(పీపుల్స్ డైరీ) :** రోడ్డు విస్తరణ కోసం ఇళు కోల్పోయి, కొత్త ఇళ్ల నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఆత్మకూర్ నుంచి కామారం వెళ్లే ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా 2022లో పలువురి ఇళ్లను తొలగించారు. ఇళ్లు కోల్పోయిన వారు అప్పులు చేసి కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నారు. నిర్మాణానికి సంబంధించిన బిల్లులు చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చినా.. కొందరికి మాత్రమే బిల్లులు అందాయని, మరికొందరికి నాలుగేళ్లు గడిచినా ఒక్క రూపాయి కూడా అందలేదని బాధితులు తెలిపారు. బిల్లులు రాకపోవడంతో అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాధితులు వెంకటరమణ, బగ్గి అశోక్‌పాల్గొన్నారు.



## 6న రక్తదాన శిబిరం

**హనుమకొండ, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ఉమ్మడి వరంగల్ జిల్లా ఇనగాల యువసేన ఆధ్వర్యంలో సెప్టెంబర్ 6న వరంగల్ జిల్లా కుడా చైర్మన్ హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదాన శిభిరాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇనగాల యువసేన ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు బొమ్మతి చంద్రపాల్, వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బొజ్జ భాను తెలిపారు. రెడ్‌క్రాస్ బ్లడ్ సొసైటీ హన్మకొండ, యన్‌యస్‌ఆర్ గూడెప్పాడ్, పరకాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులందరూ భాగస్వాములు అయ్యేందుకు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రైవేట్ ఉపాధ్యాయులకూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వాలి

**ప్రైవేట్ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి సింగనబోయిన శ్రీశైలం**



**నర్సంపేట, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలలో బోధించిన ప్రైవేట్ పాఠశాలలో బోధించినా, విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఒక్కటేనని ప్రైవేట్ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి సింగనబోయిన శ్రీశైలం తెలిపారు. దుగ్గొండి మండలం గిర్నిబావి సెంటర్లో సోమవారం జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉపాధ్యాయులను సత్కరించడం మన సంప్రదాయం అయితే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల విషయంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం సమంజసం కాదు, విద్యారంగంలో ప్రభుత్వ స్కూల్ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ స్కూల్‌లో పనిచేస్తున్న వేలాది మంది ఉపాధ్యాయులు కూడా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అనే గుర్తింపు ఒక ప్రభుత్వ టీచర్ హోదాకు మాత్రమే పరిమితం కాకూడదు, నిజంగా ఉత్తమంగా పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఎవరు? విద్యార్థుల జీవితాల్లో ఎలాంటి మార్పు తీసుకొచ్చారు? విద్యార్థుల ప్రతిభను ఎలా వెలికి తీశారు, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా వారిని ఎలా తీర్చిదిద్దారు? వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అవార్డులను అందించాలని శ్రీశైలం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులకు కూడా రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించే విధానాన్ని తీసుకురావాలన్నారు. సమావేశంలో వేణుగోపాల్, పరపల్లి సాంబయ్య సాంబయ్య, కొనుకటి రాజు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీవి 420 హామీలు

**ఉద్యమానికి సిద్ధంకండి - బీఆర్ఎస్**

**నూగురు వెంకటాపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2నుండి వారం రోజుల పాటు వెంకటాపురం మండలంలో జరిగే సమరభేరి కార్యక్రమంలో ప్రతి ఒక్క బిఆర్ఎస్ కార్యకర్త సైనికుల మాదిరి పాల్గొని మండల పార్టీని బలోపేతం చేస్తూ, ముందుకు సాగాలని జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు గొడవర్తి నరసింహమూర్తి, గంప రాంబాబు అన్నారు. సోమవారం మండల పార్టీ ఆధ్వర్యంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన అనంతరం వారు మాట్లాడారు. 1000రోజుల కాంగ్రెస్ పాలనపై, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలని వారు తీవ్రంగా మండిపడ్డారు. రైతులకు, మహిళలకు, వృద్దులకు, వికలాంగులకు విద్యార్థులకు, నిరుద్యోగులకులకు రైతు కూలీలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కారం చేయాలనీ, లేని ఏడలా ప్రజల మద్దతుతో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న దశల వారీగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు.



# ఐక్యతతో ఉంటే.. సాధించలేనిది ఏదీ లేదు!

**మల్లంపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గానికి అభినందనలు**

**నర్సంపేట, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ముదిరాజులు ఐక్యతతో కలిసి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు పొన్నం మొగిలి ముదిరాజ్ అన్నారు. దుగ్గొండి మండలం మల్లంపల్లిలో నిర్వహించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కార్యవర్గ అభినందన సభకు జిల్లా నాయకులు తాళ్ల రవీందర్ ముదిరాజ్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొన్నం మొగిలి ముదిరాజ్, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎన్ఆర్ఐ రాష్ట్ర ముదిరాజ్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, డైరెక్టర్లను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు పొన్నం మొగిలి,శానబోయిన రాజ్‌కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ముదిరాజుల హక్కుల సాధనతో పాటు మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో ముదిరాజులకు మరింత గుర్తింపు రావాలంటే ప్రతి సభ్యుడు తన వంతు కృషి చేయాలని కోరారు.

**రూ.5 లక్షల ప్రమాద బీమా కొనసాగింపుపై కృతజ్ఞతలు**

మత్స్యకారులకు అమలవుతున్న ప్రమాద బీమా పథకాన్ని మే 31 వరకు నిలిపివేసిన నేపథ్యంలో ఈ అంశాన్ని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్, రాష్ట్ర డిప్యూటీ సీఎం, మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ప్రమాదాల్లో మృతి చెందిన మత్స్యకార కుటుంబాలకు రూ.5 లక్షల ప్రమాద బీమా కొనసాగేందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.

**నూతన పాలకవర్గం ఎన్నిక..**

అధ్యక్షుడుగా సోడా సమ్మయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా పాండవుల శ్రీనివాస్ ముదిరాజ్ కార్యదర్శిగా ఈర్ల కొమ్మాలు ముదిరాజ్, డైరెక్టర్లుగా సోడా వేణు ముదిరాజ్, ఈర్ల రమేష్ ముదిరాజ్, భూమ నర్సయ్య ముదిరాజ్, ఈర్ల రాజు ముదిరాజ్, లక్క మహేందర్ ముదిరాజ్, మొద్దు వీరన్న ముదిరాజ్ ఉన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు పల్లె రమేష్ ముదిరాజ్, మండల ఉపాధ్యక్షులు ఓరంగంటి తిరుపతి ముదిరాజ్, మాజీ మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఈర్ల నరేష్ ముదిరాజ్తో పాటు కుల పెద్దలు పాండవుల రామకృష్ణ, ఈర్ల సారయ్య, సోడా శ్రీధర్, ఈర్ల రాజు చిన్న, తెప్ప సుమన్, తెప్ప పైడి, భూమ రవి, ఏళ్ల స్వామి, ఈర్ల పెద్ద కొమ్మలు, మొద్దు కిషోర్ ముదిరాజ్ తదితరులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 12 దరఖాస్తులు

**గోవిందరావుపేట, ఆగస్టు 31( పీపుల్స్ డైరీ)** మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ప్రజావాణి లో దరఖాస్తులు12 వచ్చినట్లు ఎంపీడీవో వరుణ్ కుమార్ తెలిపారు, కాగా రైతులు, పెన్షన్ దారులు, ఇందిరమ్మ ఇల్లు, ఉపాధి హామీ కి సంబంధించిన దరఖాస్తులు జరిగిందని పాలు దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీవో వరుణ్ కుమార్ వివరించారు,

## అత్యాచారం హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షులు రఘుపతి**



**చిట్యాల, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** హైదరాబాద్ లోని హాస్పిటల్లో నర్సుగా ఉద్యోగం చేస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన శిరీష అనే యువతిని హైదరాబాద్ తుక్కు గూడలో ఒక గదిలో అత్యాచారం చేసి ఆపైన పాశవికంగా హత్య చేసిన నిందితున్ని వెంటనే కఠినంగా శిక్షించాలని ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షులు మడికొండ రఘుపతి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పసిపిల్లల పైన నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళల పైన ఏదో ఒకచోట క్రమంగా అత్యాచారాలు హత్యలు వెలుగు చూస్తున్నాయని రఘుపతి ఆవేదన వ్యక్తం చేశారు. సభ్య సమాజం తల దించుకునే ఇలాంటి ఘటనలు మరో సారి పునరావృతం కాకుండా బాలికలకు మహిళలకు తగు రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పి సంపత్ రావు



**మొగుళ్ళపల్లి, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ లో సోమవారం భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు వార్షిక తనిఖీలను నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో డి.ఎస్.పి మొక్కను నాటారు. డీఎస్పీ వెంట చిట్యాల సిఐ సతీష్ ఉన్నారు. పోలీస్ స్టేషన్లోని. రికార్డులు, సీడీ ఫైళ్లు, కిట్లను, క్షుణ్ణంగా తనిఖీ చేసారు, పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల స్నేహపూర్వకంగా నడుచుకోవాలని మొగుళ్ళపల్లి ఎస్సై ముప్పు సురేష్‌కు సూచించారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత



**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రానికి చెందిన పెండ్యాల లక్ష్మీ నరసమ్మ కుటుంబానికి 'హెల్ప్ టు నీడీ' సంస్థ చేయూతనందించింది. కేటీపీపీ విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న కే. మధు కుమార్తె మనోఙ్ఞ పుట్టినరోజు సందర్భంగా రేషన్ కిట్‌తో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లక్ష్మీనరసమ్మ కుటుంబానికి అండగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆరుముల ఎల్ల స్వామి, ఆరు ముళ్ళ ప్రభాకర్, జన్ను కుమార్, సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో బాత్రూం డోర్లు ధ్వంసం

**మైలారం ప్రభుత్వ పాఠశాలలో ఘటన : పోలీసులకు ఫిర్యాదు**



**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని మైలారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల బాత్రూం డోర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. భూపాలపల్లి పరకాల ప్రధాన రహదారి పక్కన డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపం లో ఉన్న ఈ పాఠశాలలో మైలారం, గాంధీనగర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో పాఠశాలకు ఎవరూ రాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు బాత్రూం డోర్లను ధ్వంసం చేసినట్లు తెలు స్తోంది. సోమవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు డోర్లు ధ్వంసమై ఉండటం కనిపించింది. దీంతో ఉపాధ్యాయులు విషయాన్ని స్థానిక సర్పంచ్ భూక్య సమ్మయ్య నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాఠశాల పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పొడిగింపు

**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ 2026–27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా సెప్టెంబర్ 15 వరకు అవకాశం ఉందని మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పసునూటి రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ తో సమానమైన సర్టిఫికెట్ గల ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఒకే సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రభుత్వ ఉద్యోగాలకు, ఇతర అన్ని పోటీ పరీక్షలకు అర్హత ఉంటుందని వారు తెలిపారు. పూర్తి వివరాలకు 9949568522 సంప్రదించవచ్చునని వారు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లి ఆలయ భూమి పూజ

## ధర్మారావుపేటలో ఘనంగా వేడుకలు - హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని ధర్మారావుపేట గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. విశిష్ట అతిథిగా రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, ప్రత్యేక అతిథిగా తెలంగాణ రాష్ట్ర మేపా ఫౌండర్ పులి దేవేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. అన్ని కులాల సమన్వయంతో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు లంక రాజేశ్వర్ రావు, కిషన్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, వేద మంత్రోచ్ఛారణల మధ్య భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమం భక్తుల సందడి మధ్య ఆనందోత్సాహాలతో సాగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూజారి రాజేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపెల్లి భాస్కర్ రావు, మాజీ జడ్పీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, మాలహర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగిడి శ్రీనివాస్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు జోరుక సదయ్య ముదిరాజ్, ములుగు జిల్లా అధ్యక్షులు ఏర్ల వెంకన్న ముదిరాజ్, భూపాలపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల రాజమౌళి, ఉపాధ్యక్షులు చాడ కృష్ణ స్వామి, బీజేవైఎం రాష్ట్ర నాయకులు మంద మహేష్, బీజేపీ మోర్చా నాయకులు దుంపటి భద్రయ్య, బోయిని సాంబయ్య, ప్రజా ప్రతినిధులు, పాలక వర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



**మొగుళ్ళపల్లి, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** జయశం కర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల సారయ్య ఆధ్వర్యంలో. సోమవా రం ప్రజావాణిలో అధికారుల కు వినతిపత్రం అందించారు. మొగుళ్ళపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల సారయ్య మాట్లాడుతూ. మొగుళ్ళపల్లి మండలంలో వివిధ పత్రికలు ఆయా వెబ్ ఛానల్ మీడియాలో పనిచేస్తున్న దాదాపు 30 మంది జర్నలిస్టులకు ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకం అందించిన దాఖలు లేవన్నారు. ప్రజా ప్రభుత్వంలో నైనా జర్నలిస్టులకు ఇంటి స్థలా లతో పాటు ఇందిరమ్మ స్కీం కింద ఇండ్లు మంజూరు చేసి నిర్మించుకునేలా చూడాలని, ప్రతి జర్నలిస్టు కుటుంబానికి అనారోగ్యపరమైన సమస్య లు తలెత్తినట్లయితే రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సదుపాయాలు అందించేలా హెల్త్ కార్డు ఇవ్వాలని, మండల కేంద్రంలో జర్నలిస్టులకు ప్రభుత్వ స్థలంలో ప్రెస్ భవనం నిర్మించి ఇవ్వాలని ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులను గుర్తించి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ కమిటీ ప్రెసిడెంట్ నిమ్మల సారయ్య, ప్రధాన కార్యదర్శి కట్కూరి ఐలయ్య, జర్నలిస్టులు మంగళపల్లి శ్రీనివాస్, నాసాని విద్యాసాగర్, క్యాతరాజు రజనీకాంత్, చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, చెక్క శ్రీధర్, బండారి రాజు, ప్రెస్ క్లబ్ కమిటీ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కళాకారులకు డప్పుల పంపిణీ



**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** తరతరాలుగా జానపద కళలను, సంప్రదాయాలను కాపాడుతూ వస్తున్న దళిత కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గణపురం మేజర్ గ్రామపంచాయతీ 14వ వార్డు సభ్యుడు పబ్బ సమతా రవీందర్ గౌడ్ అన్నారు. సోమవారం గణపురం మండల కేంద్రంలోని కొత్తపల్లిలో పబ్బ సమతా రవీందర్ గౌడ్ తల్లిదండ్రులైన పబ్బ ప్రమీల, రాములు జ్ఞాపకార్థం కళాకారులకు ఉచితంగా డప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. డప్పు మన జానపద సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. తమ కళతో సమాజానికి సేవ చేస్తున్న దళిత కళాకారులకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. సంప్రదాయ కళలను ప్రోత్సహించడంతో పాటు కళాకారుల జీవనోపాధికి సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. కళాకారులకు సమాజంలో తగిన గౌరవం లభించేలా ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలుసాని లక్ష్మీ నరసింహ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు హఫీజ్, వైనలా వెంకటేష్, నాయకులు మామిండ్ల సాంబయ్య యాదవ్, గాజర్ల చింటూ గౌడ్, పిన్నింటి మణిదీప్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి రహిత సమాజాన్ని సాధిద్దాం



**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని హెచ్ఐవీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని వైఆర్‌జికేర్ సంస్థ ప్రతినిధులు సూచించారు. సోమవారం గణపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింక్ వర్కర్ ఎం.వీణ మాట్లాడుతూ... హెచ్ఐవీ వైరస్ ఏయే మార్గాల్లో వ్యాపిస్తుందో, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. హెచ్ఐవీ కేవలం నాలుగు ప్రధాన మార్గాల్లో మాత్రమే సంక్రమిస్తుందని తెలిపారు. అపోహలకు తావివ్వకుండా శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. తమ పరిధిలో ఎవరికైనా హెచ్ఐవీకి సంబంధించిన అనుమానిత లక్షణాలు కనిపించినా, అవసరమైన సమాచారం లేదా సహాయం కావాలన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1097కు ఫోన్ చేసి వివరాలు తెలియజేయవచ్చని చెప్పారు. విద్యార్థులు ఈ విషయాలపై అవగాహన పెంచుకొని కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.

## విద్యుత్ తీగలు సురక్షిత దూరానికి మార్చాలి



**చిట్యాల, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** వ్యవసాయ భూమిలో పామ్ ఆయిల్ చెట్లకు అత్యంత దగ్గరగా ఉన్న విద్యుత్ తీగలను సురక్షిత దూరానికి మార్చాలని కోరుతూ చిట్యాల మండల కేంద్రం రామ్‌నగర్ కాలనీకి చెందిన శీలపాక సరోజన శీలపాక రాజు చిట్యాల విద్యుత్ శాఖ ఏఈకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ చిట్యాల గ్రామ పరిధిలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం ఎదుట సర్వే నంబర్లు 5/1మరియు 5/2లో మొత్తం 4 ఎకరాల 4 గుంటల వ్యవసాయ భూమిలో పామ్ ఆయిల్ సాగు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ తీగలు చెట్లకు దగ్గరగా ఉండటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొందని ఇటీవల శీలపాక నర్సయ్యకు విద్యుత్ షాక్ తగిలిన ఘటన కూడా జరిగిందని పేర్కొన్నారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. మూడు నెలల క్రితం గాలులకు విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, ప్రస్తుతం మరమ్మతు పనుల్లో భాగంగా ఐదు కొత్త స్తంభాలు పాత సర్వీస్ వైర్లు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అవసరమైతే అదనపు స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చును తామే భరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. విద్యుత్ లైన్‌ను పామ్ ఆయిల్ చెట్లు వ్యవసాయ పనులు చేసే వారికి ప్రమాదం కలగకుండా సురక్షిత దూరానికి అత్యవసరంగా మార్చాలని వారు కోరారు.

# సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీకాంత్, తెలిపారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రజా వాణి కార్యక్రమానికి రెండు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆన్లైన్ ద్వారా కలెక్టర్ కార్యాలయానికి పంపించి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. గత వారంలో వచ్చిన అప్లికేషన్లు సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు.

# పెన్షన్ దరఖాస్తులకు ఆన్‌లైన్ అడ్డంకులు...!

**నేటితో ముగియనున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు**

**సాంకేతిక సమస్యలతో లబ్ధిదారుల అవస్థలు**

**మరో రెండు రోజులు గడువు పెంచాలని వినతి**

**జిల్లావ్యాప్తంగా ఒత్తిడితో బిజీగా మారిన నెట్‌వర్క్**

**గణపురం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** కొత్తగా పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియలో ఆన్‌లైన్ సమస్యలు దరఖాస్తుదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. పెన్షన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు సోమవారమే చివరి గడువు కావడంతో.. అదే సమయంలో సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ ప్రక్రియ సక్రమంగా సాగకపోవడంతో అధికారులు, దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా పెన్షన్లు పొందేందుకు అర్హులైన వారు తమ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. మండలంలోని గ్రామపంచాయతీల నుంచి వచ్చిన దరఖాస్తులను మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తున్నారు. పెద్ద గ్రామపంచాయతీల్లో కూడా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి ఇప్పటివరకు సుమారు 200 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. వీటిని నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అయితే జిల్లా వ్యాప్తంగా ఒకేసారి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తుండటంతో సర్వర్, నెట్‌వర్క్‌పై భారం పెరిగి ప్రక్రియ నెమ్మదిగా సాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆన్‌లైన్ పనిచేయక పోవడంతో వచ్చిన దరఖాస్తులను గడువులోగా నమోదు చేయడం ఎలా అన్న దానిపై అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఒకవైపు గడువు ముగుస్తుండగా.. మరోవైపు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో తమ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే పెన్షన్ మంజూరుకు ఇబ్బందులు ఎదురవుతాయని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కనీసం మరో రెండు రోజులపాటు గడువు పొడిగించి, దరఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

## స్లాట్ బుకింగ్‌లో దళితుల భూముల పట్ల నిర్లక్ష్యం : మల్లేష్



**చిట్యాల, ఆగస్టు 31(పీపుల్స్ డైరీ) :** భూముల రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్ ప్రక్రియలో దళితుల అసైన్డ్ భూముల పట్ల చిట్యాల మండల రెవెన్యూ అధికారులు దళిత రైతులను మాత్రమే ఇబ్బందులకు గురి చేస్తున్నారని మోకా పేరుతో దళిత రైతులను తమ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ వారికి అన్యాయం చేస్తున్నారని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదాలు వచ్చినప్పుడు మాత్రమే అసలు భూమి ఎవరి ఆధీనంలో ఉంది అని తెలుసుకోవడానికి మాత్రమే అధికారులు మోకా నిర్వహిస్తారని ప్రాథమిక సమాచారం తెలియకుండా ఎటువంటి వివాదాలు లేకుండా ఉన్న దళితుల భూముల విషయంలో కూడా స్లాట్ బుక్ చేయనీయకుండా రిజిస్ట్రేషన్ సక్సేషన్ మ్యుటేషన్ జరగకుండా అడ్డుపడుతున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకునే విధంగా పై అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న రైతులు పంటలు సాగు చేయకుంటే ఆ భూములపై అన్ని ఆధారాలు ఉన్న అట్టి రైతులకు హక్కులు ఏ విధంగా ఉండవో అధికారులు తెలపాలని ప్రశ్నించారు. దళితులు ఇతరుల భూముల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు పనితీరు మారకుంటే దళిత రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామన్నారు.

# ప్రభుత్వ ఫ్లెక్సీలపై మంత్రి కొండా సురేఖ ఫొటో మిస్సింగ్



**కేసముద్రం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లాలో జరిగిన అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ఫోటోకు చోటు దక్కకపోవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న రాజ్యసభ సభ్యుడు వెం నరేందర్ రెడ్డి సొంత మండలంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం కావడంతో భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలపై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క ఫోటోలతో పాటు, బీఆర్ఎస్ నాయకులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఫోటోలు కూడా పెట్టారు. కానీ ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఏకైక మహిళా మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అయిన కొండా సురేఖ ఫోటో మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లోనే విస్మయం వ్యక్తం అవుతోంది.

## తొలగింపు సంకేతమా!?

### వరుస ఘటనలతో అనుమానాలు :

ఇది మొదటిసారి కాదు. గత వారం గూడూరులో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కూడా సురేఖ ఫోటోను పక్కన పెట్టారు. అంతకు ముందు వేములవాడలో దేవాదాయ శాఖ మంత్రిగా ఆమెకు సంబంధించిన కార్యక్రమంలోనే ఆమె ఫోటో లేకుండా ఫ్లెక్సీలు వేశారు. ఇటీవల మంత్రి సురేఖ కూతురు సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆ తర్వాత పార్టీ క్రమశిక్షణా సంఘానికి ఫిర్యాదు వెళ్లడం తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఢిల్లీకి వచ్చాక ఆమె భవిష్యత్తుపై నిర్ణయం ఉంటుందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అధికారిక ఫ్లెక్సీల్లోనే ఫోటో లేకపోవడం మంత్రి పదవి నుంచి తొలగింపు తప్పదనే ముందస్తు సంకేతమా అంటూ జిల్లాలో సర్వత్రా చర్చ జరుగుతోంది.



# మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్న సర్పంచులను అడ్డుకున్న పోలీసులు

**కేసముద్రం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** గ్రామ పంచాయతీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ మహబూబాబాద్ జిల్లా కమిటీకి చెందిన కేసముద్రం మండల సర్పంచులను పోలీసులు అడ్డుకున్నారు. సర్పంచుల సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు, బిచ్చు నాయక్ తండా సర్పంచ్ వాంకుడోత్ రవి నాయక్ ఆధ్వర్యంలో సర్పంచులు మంత్రికి వినతిపత్రం అందించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని, కేసముద్రం సీఐ సత్యనారాయణ కార్యాలయానికి తరలించి అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రవి నాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడంతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సర్పంచుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న సర్పంచులను అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో కురవి మండల అధ్యక్షుడు రమేష్ నాయక్, కేసముద్రం మండలం వివిధ గ్రామపంచాయతీ సర్పంచ్‌లు విజయ లక్ష్మినారాయణ, మహేష్, సునీత కుమారస్వామి, వీరన్న, బాలోజీ, జ్యోతి పవన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ కార్యాలయంపై దాడి.. కాంగ్రెస్ గూండాయిజానికి నిదర్శనం

## తడుక వినయ్ గౌడ్



**నల్లబెల్లి, ఆగస్ట్ 31 (పీపుల్స్ డైరీ) :** నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడిని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడి కాంగ్రెస్ పార్టీ అసలు రాజకీయ సంస్కృతిని, వారి అసహన వైఖరిని బయటపెట్టిందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులకు రాజకీయంగా బీజేపీని ఎదుర్కొనే దమ్ము లేకనే దాడులు, విధ్వంసాలకు దిగుతున్నారని విమర్శించారు. ప్రజల మద్దతుతో బీజేపీ బలపడుతుండటాన్ని జీర్ణించుకోలేకనే ప్రజాస్వామ్యంపై ఈ దాడికి పాల్పడ్డారని అన్నారు. తమ సంయమనాన్ని చేతగానితనంగా భావిస్తే అది కాంగ్రెస్ అజ్ఞానమే అవుతుందని హెచ్చరిస్తూ, బీజేపీకి రాజ్యాంగం, చట్టం, ప్రజాస్వామ్యంపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. అధికార అహంకారంతో దాడులు చేస్తే రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. దాడులు, బెదిరింపులు, కేసులతో బీజేపీ పోరాటాన్ని ఆపలేరని, తెలంగాణలో పార్టీ మరింత బలంగా ఎదుగుతుందని స్పష్టం చేశారు. కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. దాడులు చేసి అడ్డుకోవాలని చూస్తే అది భ్రమ మాత్రమేనని, కాంగ్రెస్ గూండాయిజానికి చట్టబద్ధమైన, ప్రజాస్వామ్య బద్ధమైన మార్గంలోనే గట్టి సమాధానం ఇస్తామని వినయ్ గౌడ్ పేర్కొన్నారు.

# లక్నవరం సరస్సు నీరు వెంటనే విడుదల చేయాలి

## అఖిలపక్ష రైతు సంఘం డిమాండ్

**గోవిందరావుపేట, ఆగస్టు 31( పీపుల్స్ డైరీ) :** మండల పరిధిలోని లక్నవరం సరస్సు నుండి పంట కాలువలకు సాగునీరు విడుదల చేయాలని కోరుతూ అఖిలపక్ష రైతు సంఘం అధ్యక్షుడు ఆధ్వర్యంలో సోమవారం రైతుకు వేదికలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతు నాయకులుతుమ్మల వెంకట్ రెడ్డి, గొల్ల్యాలనర్సిరెడ్డి, మాచినేని సాంబశివరావు, మాట్లాడు తూ లక్నవరం సరస్సులో గతంలో సంవత్సరం26 అడుగుల నీటిమట్టం రావడంతో ఆయకట్టు మొత్తానికి నీరు విడుదల చేయడం జరిగిందన్నారు, ప్రస్తుతం సరస్సులో 22.4 అడుగుల నీరు ఉందని తక్షణమే వారం రోజులు లోపు నీరు విడుదల చేయాలని ప్రభుత్వా నికి రైతు కమిటీవిజ్ఞప్తి చేశారు. ఆగస్టు18న కలెక్టర్ రైతుల సమావేశంలో రైతులందరూ ముక్తకంఠంతో నీరు వదలాలని కోరారు. అనంతరం 53 మందితో రైతు కమిటీ వేశారు. ఈ సమావేశంలో రైతు నాయకులు భూక్య దేవనాయక్, గూడూరు శ్రీనివాసరావు,



వాసం స్వామి, భూ రెడ్డి మధు, బండమీది అశోక్, గుండు రామస్వామి, నిమ్మగడ్డ సతీష్, చింతల లింగారెడ్డి, తీగల ఆది రెడ్డి, సామ సమ్మిరెడ్డి, మేడ సైదిరెడ్డి, యార్లగడ్డ శేషగిరి రావు, మోపిదేవి రవి, లాకావత్ నరసింహ బోడియ నాయక్ బొమ్మినేని శ్రీనివాసరెడ్డి మట్ట వెంకట పాపిరెడ్డి బొబ్బ సత్తిరెడ్డి, మార్కా సతీష్, కొత్త సుధాకర్ రెడ్డి,మద్దినేని తేజ రాజు తదితరులు పాల్గొన్నారు,

# ఎమ్మార్సీలో క్రమబద్ధ ఉద్యోగులను నియమించాలి



**కేసముద్రం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** సమగ్ర శిక్షా శాఖలోని మండల విద్యా వనరుల కేంద్రంలో 14 సంవత్సరాలుగా పనిచేస్తున్న సమన్వయకర్తలను క్రమబద్ధీకరించాలని కోరుతూ రాష్ట్ర సంఘం ప్రతినిధులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని కలిశారు. సోమవారం ఆయన స్వగ్రామం అర్పనపల్లిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు తౌటి నరేష్ మాట్లాడుతూ, పత్రికా ప్రకటన ద్వారా, రిజర్వేషన్, రోస్టర్ విధానాన్ని పాటిస్తూ, రాత పరీక్షలో వచ్చిన ప్రతిభ ఆధారంగా పూర్తి పారదర్శకంగా జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ఎంపిక సంఘం ద్వారా ఎంపికైన సమన్వయకర్తలను క్రమబద్ధీకరించి మండల విద్యా వనరుల కేంద్రంలో బాధ్యతలు అప్పగించాలని కోరారు. క్రమబద్ధీకరణ అయ్యే వరకు వేతన స్కేలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సమన్వయకర్తలకు ఆరోగ్య కార్డులు, బీమా సౌకర్యం, పదవీ విరమణ ప్రయోజనాలు, పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా జీతాల పెంపు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ ఖాదర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దల సుదర్శన్, వరంగల్ జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# పతకాలు సాధించిన అధికారులను అభినందించిన సీపీ

**ఖమ్మం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం 2026 జూన్ 2 పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. ఉత్తమ సేవ పతకాలు సాధించిన ముగ్గురిలో అడిషనల్ డీసీపీ బి.రామానుజం, హెడ్ కానిస్టేబుళ్లు వి.బిక్షపతి, కె సూర్యప్రకాష్ రెడ్డి వున్నారు. వారితో పాటు సేవ పతకాలు సాధించిన (12) మందికి సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 15 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని పోలీస్ కమిషనర్ ఆకాంక్షించారు.

# రూ.1.90 కోట్ల విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం



**కేసముద్రం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో రూ.1 కోటి 90 లక్షల వ్యయంతో నిర్మించిన 33/11 కె.వి. విద్యుత్ ఉప కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. అనంతరం ఉపకేంద్రం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీ డాక్టర్ శబరిష్ తదితరులు పాల్గొన్నారు.

# గుముడూరు మహిళలకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పాలి

## మాజీ ఎంపీ మాలోత్ కవిత ఫైర్



**మహబూబాబాద్, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** గుముడూరు మహిళలను కించపరిచేలా రెడ్ లైట్ ఏరియా అంటూ వ్యాఖ్యానించిన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మహబూబాబాద్ మాజీ ఎంపీ మాలోత్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన బహిరంగ సభా వేదికపై, బాధ్యత గల ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి మహిళల మనోభావాలను, ఆత్మగౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఇష్టానుసారంగా మాట్లాడడం దారుణమని, విచారకరమని పేర్కొన్నారు. గుముడూరు గ్రామం మహిళలు ఎంతో గౌరవంగా, కష్టపడి జీవనం సాగిస్తున్నారని, అలాంటి మహిళలను అందరి ముందు అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తన వ్యాఖ్య పొరపాటు అని ఎమ్మెల్యే గ్రహించాలని, ఆడబిడ్డల ఆగ్రహం మరింత ఉధృతం కాకముందే, జిల్లా వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కాకముందే తన తప్పును ఒప్పుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పడం మంచిదని మాలోత్ కవిత హితవు పలికారు. లేనిపక్షంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# శిరీష హత్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

## టీఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటుగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష హైదరాబాద్ తుక్కుగూడలో దారుణ హత్యకు గురైన ఘటనపై తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, వరంగల్ జోన్ ఇన్‌చార్జ్ దమళ్ల సత్యం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళను అత్యంత దారుణంగా హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, నిందితులను వెంటనే గుర్తించి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తుక్కుగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న శిరీషను దుండగులు హత్య చేయడం అత్యంత బాధాకరమని సత్యం అన్నారు. ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ మహిళకు రక్షణ లేకపోవడం ఆందోళనకరమన్నారు. మహిళల భద్రతపై ప్రభుత్వం ఎన్నో హామీలు ఇస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. ఒక మహిళకు ఒక న్యాయం.. ఆదివాసీ మహిళకు మరో న్యాయమా?అనే అనుమానం ప్రజల్లో కలగకుండా ప్రభుత్వం ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేయాలని సత్యం డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# పచ్చదనం పెంపునకు స్వచ్ఛందంగా ముందడుగు



**ఆత్మకూర్, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ముదిరాజ్ యువత మొక్కలు నాటి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. నీరుకుల్లా గ్రామంలోని పెద్ద చెరువు కట్టపై యువత ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రభుత్వం చేపడుతున్న పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలకు తమవంతు సహకారం అందించేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. యువత చెట్లు నాటడాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో మానగాని శంకర్, మానగాని ప్రశాంత్, మానగాని నాగరాజు, పిట్టల రాజ్‌కుమార్, కావటి నాగరాజు, ఉడత శశికుమార్, పిట్టల రాంరాజ్, మానగాని మల్లికార్జున్, మానగాని జనార్ధన్, జిర్ర శ్రీకాంత్, ఉడుత మాధవ్, దుండి చిరంజీవి, పిట్టల సూరయ్య, అన్నవేనా విజేందర్, తక్కళ్లపల్లి చిరంజీవి, దారబోయిన రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల సాధన కోసం సమరశంఖం

## సెప్టెంబర్ 7న ఏటూరునాగారానికి వేలాదిగా తరలిరావాలి - డా. మైపతి అరుణ్ కుమార్



**పినపాక, ఆగస్టు 31,(పీపుల్స్ డైరీ) :** ఆదివాసీల హక్కుల పరిరక్షణ, రాజ్యాంగబద్ధమైన చట్టాల అమలు, ఉద్యోగాలు, భూమి హక్కులు, సాగునీరు, ఉపాధి అవకా శాల సాధన కోసం సెప్టెంబర్ 7న ఏటూరునాగారంలో నిర్వహించనున్న ఆదివాసీ మార్చ్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో పినపాక మండలంలోని జానంపేట, చెగర్షాల గ్రామాల్లో ఆదివాసీ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలెబోయిన వెంకట నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా. మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి ముఖ్య అతిథులుగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, ఆదివాసీల హక్కులు, భూములు, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన 5వ షెడ్యూల్ రక్షణ, పెస చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ ప్రాంతాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బిటీపిఎస్ కేటీపీస్ , బీపీఎల్ , సింగరేణి తదితర సంస్థల్లో ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు అలెం కోటి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలెబోయిన వెంకటనారాయణ, పినపాక మండల అధ్యక్షులు కబ్బాక రమేష్, తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసీ యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో పంట నమోదు చేసుకోవాలి : ఏఈఓ

**గోవిందరావుపేట, ఆగస్టు 31(పీపుల్స్ డైరీ) :** ఆన్లైన్లో పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి దారా సింగ్ తెలిపారు, ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన పంట నమోదు సిబ్బంది పొలాలను నియమించిన సర్వేలు సందర్శించి రైతు సాగు చేసిన పంట, సర్వే నంబర్, పంట రకం, వరి రకం, నీటి వసతి మరియు ఇతర వివరాలను నమోదు చేస్తారని తెలిపారు, పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం పంటల కొనుగోలు జరుగుతుందని అన్నారు. అలాగే సన్న వరి ధాన్యం వడ్లకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ వంటి ప్రయోజనాలు అందించడంలో పంట నమోదు వివరాలు కీలక మని తెలిపారు. రైతులందరూ పంట నమోదు సిబ్బంది కి సహకరించి తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, సాగు చేసిన పంటకు సంబంధించిన సరైన వివరాలను తెలియజేసి పంట నమోదు చేయించుకోవాల దారా సింగ్ కోరారు.

పీపుల్స్ డైరీ
కరీంనగర్
మంగళవారం, 1 సెప్టెంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 169






# ప్రజాసేవే పరమావధిగా సమగ్ర అభివృద్ధే లక్ష్యం

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**అభివృద్ధిలో ఆదర్శంగా ఖమ్మం జిల్లా**

**స్థానిక కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా దంసలాపురం రోడ్డు వరకు బీటీ రోడ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంకుస్థాపన**

**ఖమ్మం, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక ప్రకాశ్ నగర్ లో కాటన్ మార్కెట్ నుండి ప్రకాశ్ నగర్ మీదుగా ఎస్ వి ఎం స్కూల్, దంసలాపురం రోడ్డు వరకు రూ. 12 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... తనకు ప్రజాశ్రేయస్సే ముఖ్యమని, తా ను ఎప్పుడూ పదవులను ఆశించలేదని, కేవలం ప్రజల ఆకాంక్షలు, ఒత్తిడి మేరకే రాజకీయాల్లో కొనసాగుతు న్నానని తెలిపారు. స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. ఖమ్మం ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి, ఇచ్చిన ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అభివృద్ధి రూపంలో ఆ రుణం తీర్చుకుంటానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఖమ్మం నియోజకవర్గానికి అవస రమైన విద్యా, వైద్య, రహదారుల నిర్మాణంతో పాటు మౌళిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలు కోరిన, తన దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తెలిపారు. రాజకీయ వర్గాలు, కులమతాలకు అతీతంగా ప్రజాస్వామ్య విలువ లను గౌరవిస్తూ అందరి సహకారంతో ఖమ్మం రూపురే ఖలు మారుస్తామని మంత్రి అన్నారు. ఖమ్మం పట్టణాన్ని అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ఏకైక కోరిక అని, నియోజకవర్గంలో రవాణా, తాగునీరు, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్ తర్వాత ఆ స్థాయిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం ఖమ్మమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో నిందితులకు ఏడాది జైలు శిక్ష ఖరారు

**ఖమ్మం లీగల్, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకున్న అప్పుకు సంబంధించిన చెక్కు బౌన్స్ అయిన కేసులో నిందితులకు విధించిన శిక్షను ఖమ్మం జిల్లా కోర్టు స్థిరీకరించింది. కేసు వివరాల్లోకి వెళితే... ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ 10వ డివిజన్‌కు చెందిన కొప్పుల నరసింహారావు- కొప్పుల సుభద్ర దంపతులు తమ కుటుంబ అవసరాల కోసం ఫిర్యాదు దారుడైన దురిశెట్టి వెంకన్న (తండ్రి రాములు) వద్ద నుండి రూ. 22,00,000/- (ఇరవై రెండు లక్షల రూపాయలు) అప్పుగా తీసుకున్నారు. ఆ మొత్తానికి బదులుగా వారు జారీ చేసిన చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో (చెక్ బౌన్స్) దురిశెట్టి వెంకన్న కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన దిగువ కోర్టు (ఎస్.టి.సి.నెంబర్ .76/2024), నిందితులకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు, రూ. 22,00,000/- పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు ఖమ్మం జిల్లా కోర్టులో అప్పీల్ (సిఆర్ ఎల్.ఎ.నెంబర్ .15/2026) దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన, 2వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వాసుకుల సీనయ్య నేడు (31-08-2026) నిందితుల అప్పీల్‌ను కొట్టివేశారు. దిగువ కోర్టు విధించిన ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ. 22 లక్షల పరిహారాన్ని యథాతథంగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవేళ నిందితులు ఆ పరిహార మొత్తాన్ని చెల్లించని పక్షంలో, అదనంగా మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు.

## అంచనాల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే కోరం



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ రాష్ట్ర శాసన సభ అంచనాల కమిటీ చైర్మన్‌గా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శాసన సభ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ ముఖ్య అతిథులుగా హాజరై కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపులు, వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, ప్రభుత్వ అంచనాలు--వ్యయాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడంతో పాటు ప్రభుత్వ నిధులు సక్రమంగా, సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ నిధుల సద్వినియోగమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఈ సమావేశంలో అంచనాల కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, సుదీర్ రెడ్డి, ఎమ్మెల్సీ యదవ రెడ్డి, శాసన సభ, శాసన మండలి ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి భూమికి నోటిమాట అనుమతేనా..?

**లారీలు నిలుపుకోండన్న జీఎం మాటే ఆధారమా..?**

**మణుగూరు, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి సంస్థకు సంబంధించిన భూమిలో ప్రైవేటు లారీలు పెద్ద సంఖ్యలో నిలిపి ఉంచడం చర్చనీయాంశంగా మారింది. ఈ స్థలాన్ని లారీలు నిలుపుకునేందుకు సింగరేణి జీఎం నోటిమాటగా అనుమతి ఇచ్చారని లారీ యూనియన్ వర్గాలు చెబుతున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన భూమిని ప్రైవేటు వాహనాల పార్కింగ్/యార్డుగా వినియోగించేందుకు కేవలం నోటిమాట అనుమతి సరిపోతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ జీఎం స్థలాన్ని వినియోగించుకోవచ్చని అనుమతించినట్లయితే, దానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు ఉన్నాయా? లారీ యూనియన్‌కు ఎంత విస్తీర్ణంలో స్థలం కేటాయించారు? ఎంతకాలం వినియోగించుకునే అవకాశం కల్పించారు? అనే వివరాలు బయటకు రావాల్సి ఉంది. మరోవైపు, ఈ స్థల వినియోగానికి అద్దె, లీజు లేదా ఇతర రుసుములు ఏమైనా నిర్ణయించారా? నిర్ణయించి ఉంటే సింగరేణి సంస్థకు ఎంత ఆదాయం వస్తోంది? లేక ఉచితంగానే స్థలాన్ని వినియోగించుకునే అవకాశం కల్పించారా? అనే అంశాలు కూడా ఆసక్తికరంగా మారాయి. నోటిమాట అనుమతి నిజమే అయితే.. దానికి ఫైల్ నోట్ లేదా అధికారిక అనుమతి పత్రం ఎందుకు లేదు? అధికారిక అనుమతి లేకపోతే.. సింగరేణి భూమిలో ఇంత పెద్ద సంఖ్యలో ప్రైవేటు లారీలు ఎలా నిలిచాయి? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### అధికారులు స్పష్టత ఇవ్వాల్సిందే!

సింగరేణి భూమి ప్రజా సంస్థ ఆస్తి. దాని వినియోగానికి సంబంధించి ప్రతి నిర్ణయానికి నిబంధనలు, అధికారిక అనుమతులు, రికార్డులు ఉండాల్సిన అవసరం ఉంది. కాబట్టి ఈ స్థలాన్ని లారీ యూనియన్‌కు ఏ ప్రాతిపదికన వినియోగించుకునే అవకాశం ఇచ్చారో సింగరేణి యాజమాన్యం స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. "జీఎం నోటిమాటగా చెప్పారనే మాటకు రికార్డు ఉందా..? లేక అధికారిక అనుమతి లేకుండానే స్థలం వినియోగంలో ఉందా..?" అనే అనుమానాలకు సింగరేణి అధికారులు తెరదించాల్సిన అవసరం ఉంది. ఫొటోలో కనిపిస్తున్న లారీల నిలుపుదలతో పాటు, స్థల వినియోగానికి సంబంధించిన అనుమతి పత్రాలు, ఫైల్ నోట్, లీజు/అద్దె వివరాలు వెలుగులోకి వస్తే అసలు వాస్తవం బయటపడే అవకాశం ఉంది.

## సింహాద్రి శివ హత్య కేసులో 23 మంది అరెస్ట్

**మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ రవీంద్రరెడ్డి**




**మణుగూరు, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** మణుగూరులో సంచలనం సృష్టించిన సింహాద్రి శివ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. కేసుకు సంబంధించి మొత్తం 27 మంది నిందితులను గుర్తించగా.. వారిలో 23 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మణుగూరులో నిర్వ హించిన మీడియా సమావేశంలో డీఎస్పీ రవీంద్రరెడ్డి, సీఐ పాటి నాగబాబు, ఎస్ఐలు నగేష్, రవుఫ్ కేసు దర్యాప్తు, నిందితుల అరెస్టుకు సంబంధించిన వివరాల ను వెల్లడించారు. హత్య ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

### 27 మందిపై కేసు.. 23 మంది అరెస్టు

హత్య కేసులో మొత్తం 27 మంది నిందితుల ప్రమేయాన్ని గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. వీరిలో 23 మందిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగిలిన నలుగురు నిందితులు పోలీసుల నుంచి తప్పించుకుని పరారీలో ఉన్నారని, వారి ఆచూకీ కోసం ప్రత్యేకంగా గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

### పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు

కేసులో ఇంకా నలుగురు నిందితులు పరారీలో ఉండటంతో వారి కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేసినట్లు సమాచారం. నిందితులు ఎక్కడ దాక్కున్నారనే అంశంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలను దర్యాప్తు పూర్తయ్యే కొద్దీ వెల్లడించే అవకాశం ఉంది.

### హత్య కేసులో కీలక పరిణామం

మణుగూరులో జరిగిన సింహాద్రి శివ హత్య ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి పెద్ద సంఖ్యలో నిందితులను అరెస్టు చేయడం కేసులో కీలక పరిణామంగా మారింది. 23 మంది అరెస్టుతో కేసు దర్యాప్తులో ముఖ్యమైన ముందడుగు పడినట్లు పోలీసులు తెలిపారు.

## గ్రామస్థాయి నుంచే కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మండల రాంమహేష్ ఆధ్వర్యంలో మండలంలోని పొచారం తండా, బోయితండా, మాణిక్యారం, ముత్తారపు కట్ట, రొంపేడు, మామిడిగుండాల, సీఎస్పీ బస్తీ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా పర్యటించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాంమహేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎట్టి



హరికృష్ణ, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు ఇస్లావత్ సతీష్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, ఇల్లందు ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కాకటి భార్గవ్, నాయకులు మూతి కృష్ణ, పూనెం సురేందర్, పొచారం తండా సర్పంచ్ వాంకుడోత్ భారతి శ్రీను, చెన్నూరి శ్రీను, చెన్నూరి కృష్ణ, ఉపేందర్, పడిగ సంపత్, ధారావత్ తులిశ్యా, పాయం కృష్ణ ప్రసాద్, మోకాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి గ్రామంలో అన్నప్రసాద వితరణ



**పినపాక, ఆగస్టు 31(పీపుల్స్ డైరీ) :** పినపాక మండలం ఉప్పాక గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంట ఆదివాసి గ్రామంలో అఖండ యూనివర్సల్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఆదివాసి పిల్లలకు భోజనాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కట్ల నరేష్ మాట్లాడుతూ, ఆదివాసి ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, ఆహార భద్రత వంటి అంశాలపై మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వెంకటేష్, గణేష్, ఈశ్వరయ్య, గ్రామ పెద్దలు బాడిషా, చందు, సోయ నాగేశ్వరరావు తదితరులు పాల్గొని పిల్లలకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. గ్రామస్థులు ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని వారు కోరారు.

## మలిశెట్టి సూర్యనారాయణకు ఘన సన్మానం



**ఏన్కూరు, ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరులో పంచాయతీరాజ్ శాఖలో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి సోమవారం పదవీ విరమణ పొందిన పంచాయతీరాజ్ ఏఈ మలిశెట్టి సూర్యనారాయణకు, మండల పరిషత్ కార్యాలయంలో పదవీ విరమణ వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మలిశెట్టిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విధుల నిర్వహణలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా పనిచేసిన సూర్యనారాయణ మండలంలోని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి మంచి ఆదరణ పొందారని పేర్కొన్నారు. ఉత్తమ పంచాయతీ రాజ్ ఏ ఈ గా డిప్యూటీ సీఎం చేతుల మీదుగా అవార్డ్ అందుకోవటం అభినందనీయం అని అన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి,ఈ ఈ మహేష్ బాబు ,డి ఈ. కరుణాకర్ రెడ్డి,ఎంపీడీవో భాగ్యశ్రీ, ఏ ఎం సి చైర్మన్ లచ్చిరాం నాయక్,ఏ ఈ అనూష,పలువురు ప్రజా ప్రతినిధులు,సర్పంచులు,తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలి

**తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఆగస్టు 31(పీపుల్స్ డైరీ) :** నర్సు శిరీష మృతి ఘటనపై తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలేబోయిన వెంకటనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.శిరీష మృతికి సంబంధించి నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సానద్ ఉల్లా ఖాన్‌పై సమగ్ర విచారణ జరిపి, నేరం రుజువైతే చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు.




"ఒక నర్సు తన ప్రాణాలను లెక్కచేయకుండా ఇతరుల ప్రాణాలను కాపాడే సేవ చేస్తుంది. అలాంటి సేవా వృత్తిలో ఉన్న శిరీష ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం.ఈ ఘటనపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు" అని వెంకటనారాయణ ఘాటుగా వ్యాఖ్యా నించారు. శిరీష మృతిపై పూర్తి స్థాయి, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, సాక్ష్యాధారాల ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. 'సానద్ ఉల్లా ఖాన్‌పై వచ్చిన ఆరోపణలు నిజమని దర్యాప్తులో తేలితే, ఎలాంటి రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠినమైన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నిందితుడు ఎవరైనా చట్టం ముందు సమానమే." అని ఆయన అన్నారు. "న్యాయం ఆలస్యం అయితే మరో అన్యాయానికి అవకాశం ఇచ్చినట్టే!" బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి తక్షణన్యాయం,పరిహారం, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

## కార్మిక సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయూ సదస్సు

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) ఆగస్టు 31 (పీపుల్స్ డైరీ) :** కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న కొత్తగూడెంలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ జిల్లా సదస్సు, ప్రదర్శనను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జే. సీతారామయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లందు జేకే సివిల్ కాంట్రాక్టు కార్మికుల వద్ద ప్రచారం నిర్వహించి, అనంతరం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు 2013 నుంచి హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి తగిన వేతనాలు కల్పించాలన్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఇల్లందు సింగరేణి మనుగడను కాపాడాలని, కొత్త బొగ్గు గనులు




ప్రారంభించాలని, గనుల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, ఉపాధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎండీ రాసుద్దీన్, కొండపల్లి శ్రీనివాస్, ఏరియా కమిటీ అధ్యక్షుడు రావూరి ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com